PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 315 | విజయవాడ, గురువారం 20 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 20 June 2024 | Rs

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి

- జిఒ 3 పునరుద్ధరణ హామీ నెరవేర్చండి
- మంత్రి సంధ్యారాణికి గిరిజన సంఘం వినతి

3

డిజిపిగా ద్వారకా తిరుమలరావు



ప్రజాశక్తి - అమరావతి

రాష్ట్ర నూతన డిజిపిగా సిహెచ్ ద్వారకా తిరుమలరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1989 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ద్వారకా తిరుమలరావు ప్రస్తుతం ఆర్‌టిసి ఎమ్‌డిగా విధులు నిర్వహిస్తున్నారు. తక్షణమే ఈ నియామకం అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హోంశాఖ కార్యదర్శిగా ఉన్న హరీష్‌గుప్తాను డిజిపిగా నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన స్థానంలో ద్వారకాతిరుమలరావును ప్రభుత్వం నియమించింది.

జగన్ టీమ్ జిఎడికి అటాచ్

- శ్రీలక్ష్మి, ప్రవీణ్‌ప్రకాష్, రజత్‌భార్గవ, వివేక్‌కు పోస్టింగ్ నో
- 19 మంది సీనియర్ అధికారుల బదిలీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వంలో కీలక అధికారులను బదిలీ చేశారు. గత ప్రభుత్వానికి సనిహితంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కుంటున్న పలువురు అధికారులపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జిఎడి)బుధవారం జారీ చేసిన జిఓలో ఆ అధికారులకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. జిఎడిలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ జాబితాలో పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వై.శ్రీలక్ష్మి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, ఎక్సైజ్‌లో ఉన్న రజత్ భార్గవ ఉన్నారు. రాజధాని అమరావతిని దెబ్బతియ్యడం లోనూ, విశాఖలో టూరిజం భవనాలను సిఎంకు కేటాయించవచ్చంటూ నివేదికను రూపొందించడం లోనూ శ్రీలక్ష్మి చురుకైన పాత్ర నిర్వహించారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలోని పెద్దల సూచనల మేరకు ఉపాధ్యాయులపై పెద్దఎత్తున వేధింపు చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ప్రవీణ్‌ప్రకాశ్‌పై ఉన్నాయి. పెద్దఎత్తున సస్పెన్షన్లకు దిగడంతో పాటు, వైన్‌షాపుల మందు కాపలాకు కూడా ఆయన ఉపాధ్యాయులను వినియోగించారు. ఎక్సైజ్ శాఖలో జరిగిన అవినీతిని అడ్డుకోకపోవడంతో పాటు, సహకరించారన్న ఆరోపణ కూడా రజిత్ భార్గవ్‌పై ఉంది.

దీంతో ఈ ముగ్గురికి తాజాగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో పెన్షన్‌కోసం వృద్ధులను సిఎస్‌తో పాటు, సెర్ప్ సిఇఓ మురళీధర్‌రెడ్డి కూడా ఉద్దేశ్యపూర్వకంగా తీవ్ర ఇబ్బందులు పాల్జేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనకు కూడా పోస్టింగ్ ఇవ్వలేదు పేదలకు ఇళ్ల పేరుతో సిఆర్‌డిఏ మాస్టర్ ప్లాను మార్పులో కీలకంగా వ్యవహరించిన వివేక్‌యాదవ్‌ను కూడా జిఏడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్లాను మార్పు విషయంలో రైతులు కోర్టుకు వెళ్లారనే ఉద్దేశంతో అభ్యంతరాలకు కూడా మిగతా 5లో

రైతు సాయం.. తేలేదెన్నడు!

ఏరువాక సాగేదెలా? • పిఎం కిసాన్‌తో కలిపితే అంతే.. • అరకొర లబ్ధికీ అన్నదాతలు దూరం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రభుత్వం అందిస్తామన్న ఆర్థిక సహాయం ఉంటుందా లేదా అనే సందేహాలు ఖరీఫ్ వేళ అన్నదాతల్లో వ్యక్తమవుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయదారులకు 'రైతు భరోసా' పేరిట కేంద్రంతో కలిపి సంవత్సరానికి మూడు విడతల్లో రూ.13,500 ఆర్థిక సహాయం అందించగా, టిడిపి-జనసేన ప్రకటించిన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలోని 'సూపర్‌సిక్స్'లో రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి వారం దాటినా రైతులకు చేస్తామన్న సాయంపై చర్చే లేదు. పోలవరం, రాజధాని అమరావతి, ఇత్యాది అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానంగా దృష్టి పెట్టారు. కానీ ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతుండగా రైతులకు అందించే ఆర్థిక సహాయంపై కదలిక లేకపోవడంతో ఈ ఏడాది సాయం ఉంటుందా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పథకం అమలు కావాలంటే అర్హతలు నిర్ణయం కావాలి. పాత ప్రభుత్వం మల్లే కేంద్రానికి చెందిన పిఎం కిసాన్ నిబంధనలనే ఇప్పుడూ అమలు చేస్తుందా, లేదంటే రాష్ట్ర ప్రభుత్వం వేరేగా నిబంధనలు రూపొందిస్తుందా అనే సందేహాలను నివృత్తి చేసే వారెవరూ లేరు. ఈ నెల 22న ఏరువాక పౌర్ణమి ఉందని, ఆ నాడు



రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడం సంప్రదాయమని, అప్పటికి ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావొచ్చని ప్రభుత్వవర్గాలు అంచనా వేస్తున్నాయి.

కోతలకే ఆ షరతులు

కేంద్రం అమలు చేస్తున్న పిఎం కిసాన్ స్కీంకు నిర్ణయించిన షరతులు లబ్ధిదారుల సంఖ్యకు కోతలు పెడుతున్నాయి. రాష్ట్రం నుంచి రైతుల జాబితాలు పంపేది ఇక్కడి ప్రభుత్వమే. కానీ రాష్ట్ర సర్కారు ఎంపిక చేసి పంపిన రైతుల్లో నుంచి కేంద్రం లక్షల మందిని ఏరేస్తోంది. దరఖాస్తులను తిరస్కరిస్తోంది. సొంత భూమి కలిగిన రైతులకే పిఎం కిసాన్ సాయం అన్నందున కౌలు రైతులు కాకుండా ఎ.పి. నుంచి వైసిపి సర్కారు సుమారు 52 లక్షల మంది రైతులను ఎంపిక చేసి పంపగా భూరికార్డులతో అనుసంధానం, ఆధార్ సీడింగ్, ఆధార్ బేస్డ్ పేమెంట్స్ ఇలా అనేక వడపోతల అనంతరం ప్రస్తుతం 40.91 లక్షల మంది రైతులే అర్హులు. వీరికి ఈ ఏడాది తొలి కిస్తు రూ.2 వేలను మంగళవారం కేంద్రం విడుదల చేసింది. ఇన్ని దశల్లో జల్లెడ పట్టాక కూడా చాలా మందికి సొమ్ము పడలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ర్యాండమ్‌గా (మచ్చుకు) ఐదు శాతం మందిని అధికారులు నేరుగా తనిఖీలు చేయాలని కేంద్రం నిబంధన పెట్టింది. ఆ తనిఖీ పూర్తి కాలేదు. 2023-24లో 1.88 లక్షల లబ్ధిదారుల వివరాలను ప్రత్యక్షంగా తనిఖీ చేయాల్సి ఉండగా 10 వేలు పూర్తి కావడం గగనమైంది. గతేడాది కూడా ఇదే పరిస్థితి. తనిఖీలు పూర్తి కాని లబ్ధిదారులకు తాజా కిస్తు పడిందా లేదా అనే విషయంపై స్పష్టత లేదు.

కలిపితే నష్టం

వైసిపి సర్కారు పిఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసా'ను అమలు చేసినందున రాష్ట్ర సర్కారు ఎంపిక చేసి పంపిన లబ్ధిదారుల్లో పది లక్షల మందికి కేంద్ర సాయం జమ కాలేదు. టిడిపి కూటమి సర్కారు కూడా పిఎం కిసాన్ నిబంధనలే అంటే ఇదే విధమైన కోతలు పడతాయి.

ఆ మేరకు ప్రభుత్వం చేసే అరకొర సాయాన్నీ రైతులు కోల్పోతారు. పిఎం కిసాన్ నిబంధనల మేరకే అయితే ఒకేసారి ఏకమొత్తంలో రైతులకు సాయం అందదు. ఏడాదికి మూడు విడతల్లో అందుతుంది. ఆ విధంగా చేసే సాయం పెరిగిన ధరల నేపథ్యంలో రైతుల పెట్టుబడులకు ఏ మూలకూ సరిపోదు. పిఎం కిసాన్‌తో కలిపినందున వైసిపి సర్కారు తను ఇస్తానన్న రూ.13,500 కాకుండా రూ.7,500 మాత్రమే ఇచ్చింది. కేంద్రం నుంచి రూ.6 వేలు తీసుకోమంది. పిఎం కిసాన్ నిబంధనల వలన పది లక్షల మందికి రాష్ట్రం ఇచ్చిన 7,500 మాత్రమే అందాయి. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు రాలేదు. ఆ మేరకు రైతులు సాయం నష్టపోయారు. విపత్తులతో నష్టాలపాలై ఆర్థిక సంక్షోభంలో ఉన్న రైతులు కేంద్రంతో సంబంధం లేకుండా కూటమి ఎన్నికల హామీ మేరకు రూ.20 వేలూ ఇవ్వాలని కోరుతున్నారు. కేంద్రం కౌలు రైతులకు సహాయం చేయట్లేదు. అందువలన తమకు రూ.26 వేలూ రాష్ట్రమే ఇవ్వాలని వాస్తవ సాగుదార్లు అడుగుతున్నారు.

'నెట్'లో అక్రమాలు

- పరీక్ష రద్దు
- సిబిఐ దర్యాప్తునకు ఆదేశం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో లెక్చరర్‌షిప్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పిహెచ్‌డీలలో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) మంగళవారం నిర్వహించిన యుజిసి నెట్ పరీక్షను రద్దు చేసింది. ఈ పరీక్షల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్లు నిఘా సంస్థల నుంచి ప్రభుత్వానికి సమాచారం అందింది. దీంతో బుధవారం రాత్రి నెట్ పరీక్షను రద్దు చేసినట్లు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. తిరిగి పరీక్ష ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొంది. మంగళవారం నిర్వహించిన యుజిసి నెట్ పరీక్షకు 11 లక్షల 21 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 9 లక్షల 8 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 317 నగరాల్లోని 1205 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. వైద్య విద్యలో ప్రవేశానికి ఉద్దేశించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో, తాజా పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. నీట్ పరీక్షలపై కూడా విచారణ జరుపుతామని, పరీక్షల పారదర్శకతకు కట్టుబడి ఉన్నామని కేంద్ర విద్యాశాఖ తెలిపింది.



ఖరీఫ్ పెట్టుబడి కోసం తిప్పలు

- పేరుకుపోయిన రబీ ధాన్యం బకాయిలు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.508 కోట్లపైనే పెండింగ్

కువైట్ వెళ్లేందుకు కేరళ మంత్రికి అనుమతి నిరాకరణ సమాఖ్య స్ఫూర్తికే విరుద్ధం !

- మోడీకి కేరళ ముఖ్యమంత్రి విజయన్ లేఖ

గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను యథాస్థానంలో ఉంచండి

- లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్లకు ఖర్గే లేఖ

లోపలి పేజీల్లో..

3 వరకు కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు జులై 3 వరకు పొడిగించింది. కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కోర్టును కోరింది. ఇడి కస్టడీ పొడిగింపు పిటిషన్ 'యోగ్యత లేనిది' అని కేజ్రీవాల్ తరపున న్యాయవాది వివేక్ జైన్ పేర్కొన్నారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను ఇడి మార్చి 21న అరెస్టు చేసింది. ఆ తరువాత నుంచి జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉంటున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ తరువాత మరికొద్ది రోజులు మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని కోరగా, సుప్రీంకోర్టు నిరాకరించింది. దాంతో ఆయన మళ్లీ జూన్ 2న జైలులో లొంగిపోయిన విషయం తెలిసిందే. ఇదే కేసులో మేలో అరెస్టయిన నిందితుడు వినోద్ చౌహాన్ కస్టడీని జులై 3 వరకు పొడిగించారు.

గిరిజన పంచాయతీలకు సొంత భవనాలు

- 'ఉద్యాన' సాగుకు 'ఉపాధి'
- ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ తొలి సంతకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం తనకు కేటాయించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ తరువాత గిరిజన గ్రామాల్లో పంచాయతీలకు సొంత భవనాలు నిర్మాణానికి సంబంధించిన ఫైలుపైన, ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవన పంటలకు అనుసంధానం చేసే మరో ఫైలుపైనా తొలి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు నాదేండ్ల మనోహర్, కందుల దుర్గేష్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు, జనసేన ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, లోకం మాదవి, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ యాదవ్, మండలి బుద్ధప్రసాద్, ఆరణి శ్రీనివాసులు, టిడిపి నాయకులు వర్మ, పిఆర్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కన్నబాబు, అటవీశాఖ అధికారి చిరంజీవి చౌదరి తదితరులు పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై అధికారులతో సమీక్షించారు. పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, గ్రూప్-1, 2 అధికారులు, పంచాయతీ సెక్రటరీల అసోసియేషన్ నాయకులతో భేటీ అయ్యారు.



పలు ఫైళ్లపై సంతకాలు చేస్తున్న పవన్ కల్యాణ్

ముందుకు సాగని రుతుపవనాలు

- జూన్‌లో 20శాతం తక్కువగా వర్షపాతం

న్యూఢిల్లీ : జూన్ 1న నైరుతి రుతుపవనాలు వచ్చిన తర్వాత దేశంలో జూన్ మాసంలో వర్షపాతం 20శాతం తక్కువగా నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. జూన్ 12 నుండి 18 మధ్య రుతుపవనాలు ముందుకు కదలక స్తంభించిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని తెలిపింది. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిషా, కోస్తా ఆంధ్రప్రదేశ్, వాయవ్య బంగాళాఖాతం, బీహార్, జార్ఖండ్‌ల్లో పలు ప్రాంతాల్లో ప్రస్తుతం రుతుపవనాలు ముందుకు సాగేందుకు అనువైన పరిస్థితులు నెలకొన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 1 నుండి 18 మధ్య దేశంలో 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొంది. జూన్ 1 నుండి వాయవ్య భారతంలో 10.2 మి.మీ వర్షపాతం కురిసింది. ఇది సాధారణం కన్నా 70శాతం తక్కువ. మధ్య భారతంలో 50.5 మి.మీ వర్షం కురవగా ఇది సాధారణం కన్నా 31శాతం తక్కువ. ఇక దక్షిణ ద్వీపకల్పంలో 106.6మి.మీ వర్షం కురిసింది. ఇది సాధారణం కన్నా 16శాతం ఎక్కువ. తూర్పు, ఈశాన్య భారతంలో 146.7 మి.మీ వర్షం కురవగా ఇది సాధారణం కన్నా 15శాతం తక్కువ.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై జులై 10న దేశవ్యాపితంగా ధర్నాలు

- సిఐటియు ఆలిండియా కమిటీ పిలుపు

న్యూఢిల్లీ : కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అగ్నివీర్ పథకాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని తదితర డిమాండ్ల సాధనకు జులై10న దేశవ్యాపితంగా అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని సిఐటియు ఆలిండియా కమిటీ బుధవారం పిలుపునిచ్చింది. ఎన్నికల్లో ఎదురు దెబ్బ తగిలినప్పటికీ ఎన్డీయే ప్రభుత్వ తిరోగమన, నయా ఉదారవాద విధానాల డైరెక్షన్‌లో ఎలాంటి మార్పు వుంటుందని భావించలేమని పేర్కొంది. పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ సాధించడంలో బిజెపి విఫలమైన నేపథ్యంలో దేశంలో నెలకొన్న తాజా పరిస్థితులపై సిఐటియు కేంద్ర కార్యదర్శివర్గం ఈ నెల 17, 18 తేదీల్లో న్యూఢిల్లీలో సమావేశమై చర్చించింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పని పరిస్థితులు, పెన్షన్లు వంటి జీవనోపాధి అంశాలపై గత పదేళ్ల బిజెపి పాలనలో కార్మిక వర్గం నిరంతరంగా సాగించిన పోరాటాలు, ప్రచారాలు ఈ ఎన్నికల ప్రచారంలో కొంతమేరకు దోహదపడ్డాయని సిఐటియు కార్యదర్శివర్గం పేర్కొంది. కార్మిక చట్టాల అమలును నోటిఫై చేస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనలో, కార్మికుల ఇపిఎఫ్ బకాయిలను చెల్లించడంలో యజమానులు విఫలమైతే వారికి విధించే జరిమానాలను గణనీయంగా తగ్గించడంలో, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపి) పేరుతో ప్రైవేటీకరణను ఉధృతం చేస్తోందని పేర్కొంది. ప్రజలను సమాయత్తం చేసి, ఈ విధానాలపై దాడికి వ్యతిరేకంగా గట్టి ప్రతిఘటనను నిర్మించడానికి తక్షణమే ప్రచారాన్ని చేపట్టాలని సిఐటియు కార్యదర్శివర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. కిందిస్థాయి నుండి ప్రచారాలు, ప్రజా సమీకరణ చేపట్టేందుకు దశలవారీ కార్యాచరణలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జులై 10న తహసిల్, జిల్లాస్థాయిల్లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలని, ఎన్‌ఎంపిని రద్దు చేసి ఇతర ప్రైవేటీకరణ చర్యలన్నింటినీ నిలుపుచేయాలని, కార్మికులందరికీ నెలకు రూ.26వేలకు తగ్గకుండా కనీస వేతనం నిర్ణయించాలని, కాంట్రాక్టర్ మారినా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించకుండా కాంట్రాక్ట్ వర్కర్లకు ఉపాధి భద్రతకు హామీ కల్పించాలని, ఒకే తరహా ఉద్యోగాలు చేస్తున్న వారందరికీ వారు మిగతా 2లో

13.8 లక్షల ఇళ్లు పెండింగ్

త్వరలో పూర్తి చేస్తాం • గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం అసంతృప్తిగా ఉందని, 13.8 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. 20.06 లక్షల ఇళ్లు మంజూరైతే కేవలం 6.8 లక్షల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. సుమారు 5 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదని తెలిపారు. సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణ పథకాల విషయంలో అస్తవ్యస్త విధానాలతో గత ప్రభుత్వం పేదలకు తీరని నష్టం కలిగించిందని విమర్శించారు. 11,782 లే అవుట్లలో గృహ నిర్మాణాలు చేపట్టగా, కనీస సౌకర్యాలు లెవెలింగ్, గ్రావెల్ రోడ్లు, నీటి సరఫరా వంటివి 7,500 లే అవుట్లలో చేపట్టిందన్నారు. వీటి కోసం రూ.897 కోట్లు ఖర్చు కాగా, రూ.246 కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించారని తెలిపారు. ఇళ్లు పూర్తయిన లే అవుట్లలో కాంక్రీటు రోడ్లు, మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో కష్టపడి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు వాటిల్లో నివసించే భాగ్యం కలగలేదని పేర్కొన్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వ కాలంలో గృహం యూనిట్ విలువ రూ.2.50 లక్షలు ఉంటే, గత ప్రభుత్వం రూ.1.80 లక్షలకు తగ్గించిందని తెలిపారు.



ఎస్‌సి, ఎస్‌టిలకు అందే సాయం కూడా అందించలేదని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణాలకు అనువుగా లేని స్థలాలను సేకరించి కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసిందని, వీటిపై విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గృహ నిర్మాణ కాలనీలు, లే అవుట్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉపాధి హామీ, అమృత్ పథకాల నిధుల అనుసంధానంతో పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణ ప్రాంత లబ్ధిదారులకు 2014-19 కాలంలో నిర్మించి 90 శాతానికి పైగా పనులు పూర్తయిన టిడ్కో గృహాలను గత ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో అందించేం దుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

హజ్ యాత్రలో మృత్యువాత

- వడగాడ్పులు తట్టుకోలేక 68 మంది భారతీయులు సహా 645 మంది మృతి

రియాద్ : హజ్ యాత్రకు వెళ్లిన 645 మంది వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయారు. వారిలో 68 మంది భారతీయలు ఉన్నట్లు సౌదీ అరేబియాకు చెందిన దౌత్యవేత్త ఒకరు బుధవారం వెల్లడించారు. హజ్ యాత్రలో సుమారు 550 మరణించినట్లు అధికారిక వర్గాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. హజ్ యాత్రికుల్లో 68 మంది భారతీయులు మరణించగా, వీరిలో అత్యధికులు పెద్దవయసు వారేనని తెలిపారు. కొంతమంది సాధారణ అనారోగ్య పరిస్థితులతో, మరికొంత మంది వాతావరణ పరిస్థితుల కారణంగా మరణించినట్లు భావిస్తున్నామని ఆయన వివరించారు. మృతుల్లో 323 మంది ఈజిప్షియన్లు, 60 మంది జోర్డానులతో పాటు సెనెగల్, ట్యునీషియా, ఇరాక్, ఇండోనేషియా, ఇరాన్ దేశాలకు చెందిన వారు కూడా ఉన్నారని అన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర ఉక్కబోత కారణంగా పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, ఆదివారం ఒక్కరోజే 2,700 కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయని సౌదీ అరేబియా పేర్కొంది. గతేడాది 200కు పైగా హజ్ యాత్రికులు మరణించిన సంగతి తెలిసిందే.

వానల్లో కరువు పరిశీలన

- మూడు జిల్లాల్లో పర్యటించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఒకవైపు వర్షాలు..మరో వైపు ఖరీఫ్ పనులకు సిద్ధమవుతున్న రైతులు ...ఈ నేపథ్యంలో కేంద్రబృందం రాష్ట్రంలో కరువును పరిశీలించిది. గత ఏడాది రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర సాయంకోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం స్పందించి, బృందాని ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయి పరిశీలనకు పంపే సమయానికి రుతుపవనాలు వచ్చేశాయి. వర్షాలు పడుతున్నాయి. అనేక చోట్ల ఖరీఫ్ పనులకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల మధ్యే కేంద్ర బుధవారం కేంద్ర బృందం మూడు జిల్లాల్లో పర్యటించి కరువును అంచనా వేసింది. వర్షపు జల్లుల మధ్యే కర్నూలు జిల్లాలో బృందం పర్యటించింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో అనంతపురం జిల్లాలో రైతులు పంటపొలాలను సిద్ధం చేస్తున్నారు. ఆ పనులే మధ్యే రైతులతో బృందం సభ్యులు మాట్లాడారు. నెల్లూరు జిల్లాల్లో మెట్ట ప్రాంతాల్లో కరువు బృందం పర్యటన సాగింది. వర్షాలు పడుతున్న సమాచారం అందడంతో బృంద



నెల్లూరు జిల్లా కలిగిరి మండలం గంగిరెడ్డిపాలెంలో మినుము పంటను పరిశీలిస్తున్న కరువు బృందం

సభ్యులు ఎక్కువగా కరువు తీవ్రతపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌లు చూడటానికి, రైతులతో మాట్లాడి గత ఏడాది ఎదుర్కున్న దుర్భిక్ష పరిస్థితులను వినడానికి ప్రాధాన్యత ఇచ్చారు. కర్నూలు జిల్లాలోని ఆలూరు, కోడుమూరు మండలాల్లో కరువు బృందం సభ్యులు పర్యటించారు. . రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో సమీక్ష అనంతరం కరువు బృందం సత్యసాయి జిల్లాలోనిజిల్లా రొద్దం మండలం రేగడికొట్టాల గ్రామంలో రైతులతో మాట్లాడింది. నెల్లూరు జిల్లాలో ఉదయగిరి, కలిగిరి, కొండాపురం మండలాల్లో కరువు బృందం పర్యటిచింది.కలిగిరి మండలంలోని గంగిరెడ్డిపాలెంలో కరువు వల్ల దెబ్బతిన్న మినుము పంట పొలాలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

ఆరు జిల్లాలో 87 మండలాలు

అంతకుముందు అనంతపురం నగరంలోని కలెక్టరేట్ రెవిన్యూ భవనంలో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర అధికారులు రాష్ట్రం ఆరు జిల్లాలోని 87 మండలాల్లో కరువు నెలకొందని తెలిపారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని 87 మండలాల్లో రబీ సీజన్‌లో పంటలు దెబ్బతిన్నాయని రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ కూర్మనాథ్ మిగతా 2లో

రాజధాని ప్రాంతంలో నేడు సిఎం పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి ప్రాంతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం నాడు పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుండి బయలుదేరి సీడ్ యాక్సెస్ రోడ్డు, ఉద్దండరాయునిపాలెం శంకుస్థాపన స్థలం, అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ (ఎజిసి), మంత్రులు, అఖిల భారత సర్వీసు, గెజిటెడ్, జ్యుడీషియల్ అధికారుల భవనాలను చంద్రబాబు పరిశీలించనున్నారు. గతంలో చేపట్టిన పనులు, ప్రస్తుతం ఎలా ఉన్నాయి అనే అంశాలను కూడా పరిశీలించనున్నారు.

నీరబ్ పదవీకాలం పొడిగించండి

- కేంద్రానికి సిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పదవీకాలం పొడిగించాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి హోదాలో లేఖ రాశారు. నీరబ్‌కుమార్ ప్రసాద్ పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో మరో ఆరు నెలలపాటు పొడిగించాలని కోరారు.

జలవనరులశాఖ సలహాదారుగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తొలి సలహాదారును నియమించింది. గతంలో జలవనరులశాఖలో చీఫ్ ఇంజనీరుగా పనిచేసి రిటైరైన వెంకటేశ్వరరావును ఆ శాఖకు సలహాదారుగా నియమించింది. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆయన పోలవరం ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును ప్రాధాన్యతగా తీసుకోవడంతో దానిపై అవగాహన ఉన్న వెంకటేశ్వరరావును నియమించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించొచ్చని అంచనా వేసింది. సోమవారం జరిగిన సిఎం పోలవరం పర్యటన, సమీక్షలోనూ ఆయన పాల్గొన్నారు.

రూ.20వేల కోట్ల నిధుల సమీకరణలో ఎస్‌బిఐ

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీర్ఘకాల బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.20,000 కోట్ల నిధులు సమీకరించనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తెలిపింది. ఈ నిధులను పబ్లిక్ ఇష్యూ లేదా ప్రయివేటు ప్లేస్‌మెంట్ ద్వారా పొందాలని యోచిస్తోన్నట్లు ఎస్‌బిఐ బుధవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ఇటీవల జరిగిన మీటింగ్‌లో దీనికి బ్యాంక్ సెంట్రల్ బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో ప్రిఫరెన్షియల్ బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.5వేల కోట్లు సమీకరించింది. 2023-24లో ఎస్‌బిఐ రికార్డ్ స్థాయిలో 21.6 శాతం వృద్ధితో రూ.61,077 కోట్ల నికర లాభాలు సాధించింది. ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.13.70 డివిడెండ్‌ను ప్రకటించింది.

కేసుపెట్టిన అధికారులను వదలిపెట్టను : జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'వైసిపి హయాంలో నాపై కేసులు పెట్టిన అధికారులనెవ్వరినీ వదిలిపెట్టను.. వారి అంతుచూస్తా' అంటూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. అనంతపురంలోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తనపై ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సీతారామాంజినేయులు, రవాణశాఖ మంత్రి పేర్ని నాని, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శివరాం ప్రసాద్‌లు తప్పుడు కేసులు పెట్టి తనను, తన కుటుంబాన్ని బయట తిరగనీయ్యకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. తమ కుటుంబాన్ని దొంగలనే ముద్ర వేసే ప్రయత్నం చేశారని తెలిపారు. ఇన్‌వాయిస్‌తో వాహనాలు అమ్మిన అశోక్ లైల్యాండ్ కంపెనీపై కేసు పెట్టకుండా తనపైనే కేసులు పెట్టి వాహనాలను తిరగకుండా చేశారన్నారు. నిలిపివేసిన బస్సులన్నింటికి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. తనకు న్యాయం జరగాలని, లేనిపక్షంలో ఎస్‌పి, డిటిసి కార్యాలయాల ఎదట ధర్నా చేస్తామని తెలిపారు. కక్షపూరితంగా తనపై కేసులు పెట్టి జైలులో భోజనం కూడా పెట్టకుండా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేశారని మండిపడ్డారు. ఇది తన వ్యక్తిగతమైన అంశం కాబట్టి, తాను వ్యక్తిగతంగానే పోరాడుతానని తెలిపారు.

జులై 10న దేశవ్యాపితంగా ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్ట్ వారైనా, శాశ్వత ఉద్యోగులైనా సరే అందరికీ సమాన వేతనాలు, ప్రయోజనాలు కల్పించాలని, అగ్నివీర్, ఆయుధవీర్, కొయలావీర్, ఇతర నిర్దిష్ట కాలపరిమితి గల ఉపాధులను రద్దు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరింది. ఇపిఎస్ పెన్షన్‌దారులకు రూ.9వేలు ఆ పైన కనీస పెన్షన్‌వచ్చేలా చూడాలని కోరింది. స్కీమ్ వర్కర్లను గుర్తించాలని, ఇతరులతో సమానంగా వారికి కనీస వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు, పెన్షన్ వంటి సదుపాయాలను కల్పించాలని కోరింది. స్థానికంగా వున్న డిమాండ్లు కూడా అవసరమైతే ఈ డిమాండ్ల పత్రంలో చేరుస్తామని పేర్కొంది. జులై 10న కోర్కెల దినంగా అఖిల భారత అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్ల సమాఖ్య (ఎఐఎఫ్‌ఎడబ్ల్యుఎహెచ్) పాటించనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా సిఐటియు కార్మిక లోకానికి విజ్ఞప్తి చేసింది.

రామోజీరావు జీవితం ఓ వ్యక్తిత్వ వికాస గ్రంధం

- మండలి బుద్ధ ప్రసాద్



రామోజీరావుపై నగేష్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పత్రికా రంగంలో మహోన్నత మార్పులు తీసుకువచ్చిన ఘనత ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావుకే దక్కుతుందని, ఆయన జీవితం ఓ వ్యక్తిత్వ వికాస గ్రంధమని మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ బందరు రోడ్డు బాలోత్సవ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం, కామ్రేడ్ జిఆర్‌కె-పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేష్ అధ్యక్షత వహించగా, వ్యాఖ్యాతగా సీనియర్ జర్నలిస్ట్ నగేష్ వ్యవహరించారు ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష ఉద్యమం, పరిరక్షణకు రామోజీరావు వెన్నెముకగా నిలిచారన్నారు. రామోజీరావు అపురూప శిల్పంతో అమరావతిలో స్మారకం ఏర్పాటు చేయాలని, విజయవాడ నడిబొడ్డున రామోజీరావు కాంస్య విగ్రహాన్ని నెలకొల్పేందుకు సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌లు చొరవచూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తాను బతికి ఉండగా తెలుగు భాష మృత భాష కాకూడదని రామోజీరావు చెప్పేవారని, ఇకనుంచి భవిష్యత్తులో తెలుగు భాష మృత భాష కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలుగు భాష కోసం ఆయన చేసిన సేవలను జాతి ఎన్నటికీ గుర్తుపెట్టుకుంటుందన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పత్రికారంగంలో రామోజీరావు ఓ పోరాట యోధుడన్నారు. ప్రజలపక్షాన కథనాలు రాసిన సందర్భాల్లో ప్రభుత్వాలు కక్ష సాధింపునకు దిగినప్పటికీ ఎక్కడ తగ్గకుండా పోరాడిన వ్యక్తి అని ఆయన పేర్కొన్నారు. రామోజీ తొలుత సిపిఐ కార్డు హోల్డర్‌గా ఉండేవారని, రైతు బిడ్డగా తొలుత అన్నదాత పత్రికను తీసుకొచ్చారన్నారు. ఆయన ఏ రంగంలో అడుగుపెట్టినా విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేసే వారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) మాట్లాడుతూ రామోజీరావు వివిధ రంగాల్లో చేసిన కృషి చెరిపినా చెరిగిపోదన్నారు. రామోజీరావు లేకుండా రాష్ట్ర చరిత్ర ఉండదన్నారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ మాట్లాడుతూ పత్రికారంగానికి రామోజీరావు లేని లోటు తీర్చలేనిదన్నారు. గ్రామీణ ప్రాంతాల వార్తలను పత్రికల్లో కవర్ అయ్యే విధానాన్ని ఆయనే తొలుత తీసుకొచ్చారన్నారు. పత్రికా విలువలు, ప్రమాణాలను పరిరక్షించే విధంగా ఈనాడు బృందం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ కె.గడ్డెన్న, బ్యూరో చీఫ్ వి.సురేష్, సామాజిక రాజకీయ విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ, జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, టిడిపి లీగల్ సెల్ నాయకులు గొట్టిపాటి రామకృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, కొరివి వినయ్‌కుమార్, గుండు నారాయణరావు, గోళ్ల నారాయణరావు, కాపునాడు జాతీయ అధ్యక్షులు గాలి సుబ్రహ్మణ్యం, పూర్ణచంద్రరావు, ఎపిజెఎఫ్ నాయకులు కృష్ణాంజనేయులు, అమరావతి జెఎసి దళిత నాయకులు పోతుల బాలకోటయ్యతో పాటు పలువురు జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు "అమరావతి నగర అపురూప శిల్పాలు" పుస్తకాన్ని మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించి, రామోజీరావుకు అంకితం ఇచ్చారు.

అర్ధవంతమైన చర్చలు జరగాలి

- బాధ్యతలు స్వీకరించిన ఆర్థిక మంత్రి పయ్యావుల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రానున్న శాసనసభ సమావేశాల్లో రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సంబంధించి అర్ధవంతమైన చర్చలు జరగాలని ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రిగా అసెంబ్లీలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజలకు జవాబుదారీ తనంతో కూడిన పారదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం సభ అనే విధంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు వచ్చి సమస్యలపై చర్చించాలని కోరారు. స్వపక్షమైనా, విపక్షమైనా తామే అని, ప్రజల కోసం ఏ పాత్ర పోషించడానికైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ కార్యదర్శి పిపికె రామాచార్యులు, సంయుక్త కార్యదర్శి విజయరాజు, ఉప కార్యదర్శి కె రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత అసెంబ్లీలోని తెలుగుదేశం శాసనసభపక్ష కార్యాలయంలో టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి కేశవ్ నివాళులర్పించారు.

రైతుల ఆకాంక్షలను నూతన ప్రభుత్వాలు నెరవేర్చాలి

- వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో నూతనంగా ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం దేశంలో రైతాంగం ఆత్మహత్యలు చేసుకోకుండా నివారణ చర్యలు చేపట్టాలని, పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, ఎపి రైతు సంఘం పూర్వ కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. వడ్డేశ్వరం కెబి భవన్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. రైతు రుణాలను ఒకసారి రద్దు చేసి రైతులకు రుణభారం నుంచి విముక్తి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి నష్టదాయకమైన మూడు వ్యవసాయ చట్టాలు చేసి రైతాంగ ఉద్యమంపై భయంకరమైన నిర్బంధాన్ని ప్రయోగించిన ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో రైతాంగం పెద్దయెత్తున ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కూడా టిడిపి ప్రభుత్వంలో బిజెపి భాగస్వామిగా ఉందని, ఆ పార్టీల కార్పొరేట్ అనుకూల విధానాల పట్ల రైతాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ రంగంలో భాగమైన సహకార రంగాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకుంటోందన్నారు. సహకార సంస్థల్లో పెద్దయెత్తున ఉన్న డిపాజిట్లను వ్యాపార సంస్థలకు భాగస్వామ్యం కల్పించే ప్రయత్నాలు రైతులు అడ్డుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను క్రమంగా తగ్గించి ఆ స్థానంలో కార్పొరేట్ పెట్టుబడులకు అవకాశాలు పెంచుతున్న విధానాల వల్ల ఇప్పటికే ఎరువులు, పురుగు మందుల విత్తనాలు, రవాణా, పనిముట్ల ధరలు పెంచుతున్నారని వివిఎస్‌ఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. ఖరీఫ్ పనులు ప్రారంభమవుతున్నందున వెంటనే రైతులకు పెట్టుబడిసాయం చెల్లించాలన్నారు. ధాన్యం బకాయిలు రూ.1,600 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. రబీ పంట నష్టపరిహారం, కరువు మండలాల్లో రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, వై కేశవరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి లోకేష్‌కు సమగ్రశిక్షా ఎంప్లాయీస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎపి సమగ్రశిక్షా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కలిసి వినతిపత్రం అందించారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో ఫెడరేషన్ అధ్యక్షులు బి కాంతారావుతోపాటు పలువురు బుధవారం కలిశారు. ప్రతి నెలలో సమయానికి వేతనాలు రాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతినెలా వేతనాలు వచ్చేలా ముందస్తు బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరారు. సమ్మె కాలపు వేతనాలు, సమ్మెలో జరిగిన అగ్రిమెంట్స్‌పై గత ప్రభుత్వం ఎలాంటి ముందడుగు వేయలేదని, పూర్తిగా మోసం చేసిందని వివరించారు. సమ్మెకాలం జీతం, అగ్రిమెంట్ అమలుపై చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని విభాగాలకూ మినిమం టైమ్‌స్కేల్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో విడుదల కానున్న ఉపాధ్యాయ డిఎస్‌సిలో అర్హత కలిగిన సమగ్రశిక్షా, కెజిబివి ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. గతంలో కూడా స్పెషల్ డిఎస్‌సి నియామకాలలో సమగ్రశిక్షా, కెజిబివిలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెయిటేజ్ ఇచ్చారని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ నాయకులు ఆర్ రాము, ఎం వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో ఏమాత్రం అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల పడిన వర్షాలు, ఈదురుగాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో కూలిన కరెంట్ స్తంభాలు, తెగిన వైర్లు, దెబ్బతిన్న ఫీడర్ల పునరుద్ధరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాలను, తెగిన వైర్లను, దెబ్బతిన్న ఫీడర్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 48 గంటలపాటు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం, అసౌకర్యం లేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

21న 9:46 నిమిషాలకు అసెంబ్లీ

- అసెంబ్లీ చీఫ్ మార్షల్‌గా గణేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ 16వ అసెంబ్లీ తొలి సమావేశాలు 21వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:46 గంటలకు సభ ప్రారంభమవుతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీచేశారు. తొలిరోజు అసెంబ్లీ కార్యదర్శి రామాచార్యులు ప్రొటెం స్పీకరు ఎన్నికలను ప్రకటిస్తారు. అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరడంతో, ఏడుసార్లు సభ్యుడిగా ఎన్నికైన గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకరుగా వ్యవహరించేందుకు అంగీకరించారు. తొలిరోజు సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. అనంతరం స్పీకరు ఎన్నికల, అభినందనలు ఉండనున్నాయి. వరుసగా గవర్నర్ ప్రసంగం, ధన్యవాదాలు తెలిపే సభ జరగనున్నాయి. మొత్తంగా నాలుగు నుండి ఐదు రోజుల పాటు సభ జరిగే అవకాశం ఉంది.

చీఫ్ మార్షల్ మార్పు

అసెంబ్లీ చీఫ్ మార్షల్‌గా గణేష్‌ను నియమించారు. ఇప్పటి వరకూ ఆయన ఆక్టోపస్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఉన్నారు. ప్రస్తుతం మార్షల్‌గా ఉన్న మాలకొండారెడ్డిని విధుల నుండి రిలీవ్ చేయాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశిస్తూ, బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

జగన్‌తో రోజా భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో ఓటమి అనంతరం మాజీ మంత్రి ఆర్‌కె రోజా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బుధవారం భేటీ అయ్యారు. ఆమెతోపాటు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు సత్యనారాయణమ్మ తదితరులు ఉన్నారు. వైసిపికి వున్న ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని, ఏ మాత్రం అధైర్యపడొద్దని వారికి జగన్ దిశానిర్దేశం చేశారు.

దాడులు చేయడమే ప్రక్షాళనా? : నాగార్జున యాదవ్

యూనివర్సిటీలను ప్రక్షాళన చేస్తామని టిడిపి ప్రభుత్వం ఎక్కడికక్కడ దాడులు చేయిస్తోందని, దాడులు చేయడమే ప్రక్షాళనా? అని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు వుండకూడదని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేస్తున్న టిడిపికి ఎన్‌టిఆర్ విగ్రహాలు కనిపించకపోవడం దారుణమన్నారు.

యువశక్తితో ముందుకెళదాం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని, యువశక్తితోనే ఈ పోరాటం మరింత ఉధృతం అవుతుందని స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1224వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో ఒబిసి అసోసియేషన్ సభ్యులు కూర్చున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కులను తుంగలో తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తోంద న్నారు. ఈ చర్యలను నిరసిస్తూ యువత పెద్ద ఎత్తున పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి

స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు స్టీల్‌ప్లాంట్ ఒబిసి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంట్‌కు కావలసిన ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు. ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే నిర్వాసితులకు, ఒబిసిలు, ఎస్‌సి, ఎస్‌టిలు, వికలాంగులకు, మాజీ సైనికులకు న్యాయం జరుగుతుందని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటు పరం కాకుండా కాపాడాలని కోరారు. పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం, స్టీల్ మినిస్టర్ సహకారంతో ప్లాంట్‌ను కాపాడే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒబిసి అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, కోయిలాడ శ్రీనివాస్, జిఆర్‌కె.నాయుడు, మోహిద్దీన్, నరసింగరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

హిందూజా కుటుంబానికి చిక్కులు : స్విట్జర్లాండ్‌లో విచారణ

న్యూఢిల్లీ : యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లోని అత్యంత ధనికులైన హిందూజా కుటుంబం మానవ అక్రమ రవాణా, జెనీవాలోని వారి భారతీయ సిబ్బందిని శ్రమ దోపిడీ చేసినందుకు స్విట్జర్లాండ్‌లో విచారణ ఎదుర్కొంటున్నారని బిబిసి తన కథనంలో తెలిపింది. ప్రకాష్, కమల్ హిందూజా, వారి కుమారుడు అజయ్, ఆయన భార్య నమ్రత అనే నలుగురిపై సోమవారం జెనీవాలో విచారణ ప్రారంభమైంది. వారు తమ పిల్లలను, జెనీవాలోని వారి ఇంటిని చూసుకోవటానికి భారత్ నుంచి కార్మికులను తీసుకువచ్చారు. దీనికి సంబంధించి స్విట్జర్లాండ్‌లో వారిపై కేసు నమోదైంది. హిందూజాలు కార్మికుల పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారనీ, అనుమతి లేకుండా వారిని ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వలేదని న్యాయవాదులు ఆరోపించినట్టు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. కార్మికులకు జీతాలు భారత్‌లోనే చెల్లించబడుతున్నాయనీ, వారికి ఖర్చు చేసేందుకు స్విస్ ఫ్రాంక్‌లు లేవని ప్రాసిక్యూటర్ వైవ్స్ బెర్టోసా ఆరోపించారు. బ్లూమ్‌బెర్గ్ ప్రకారం.. "వారు తమ ఉద్యోగుల్లో ఒకరి కంటే ఒక కుక్క కోసం ఎక్కువ ఖర్చు చేశారు. హిందూజా ఇంటిలోని ఒక భారతీయ వ్యక్తికి 18 గంటల పని దినానికి 7 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 660) మాత్రమే చెల్లించారు" అని ఆయన కోర్టుకు తెలిపారు. హిందూజా కుటుంబం వారి కుక్కల కోసం ఏటా 8,584 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 8,09,326) వెచ్చిస్తున్నట్టు చూపించటానికి "పెంపుడు జంతువులు" అనే బడ్జెట్ పత్రాన్ని చూపించారు.



మంత్రి కొలుసు పార్థసారధిని కలిసిన ప్రజాశక్తి బృందం

నిబద్ధత గల పత్రిక ప్రజాశక్తి : మంత్రి పార్థసారథి

విజయవాడ : ప్రజాశక్తి పత్రిక నిబద్ధత గురించి తనకు తెలుసునని, ప్రజాశక్తి ప్రజల పక్షాన నిలుస్తుందని సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం ఉదయం ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, అడ్వర్టయిజ్మెంట్ జనరల్ మేనేజర్ తిరుపాల్ రెడ్డి, మేనేజర్ రమేష్ మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ... ప్రజానుకూలమైన నిర్ణయాలతోనే పాలన వుంటుందని అన్నారు. ప్రజాశక్తి నిబద్ధతను ఆయన ప్రశంసించారు.

దిశ స్టేషన్లు మహిళా పోలీస్ స్టేషన్లుగా మార్పు

- గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తాం
- హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వంగలపూడి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఎలాంటి చట్టం లేకుండానే దిశ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారని, వాటిని మహిళా పోలీస్ స్టేషన్లుగా మారుస్తామని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో గురుతర బాధ్యతను పెట్టారని, శాంతిభద్రతలను అదుపులో పెట్టడంతోపాటు, మహిళలపై అఘాయిత్యాలను తగ్గించడం, గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఎపిని మార్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. బుధవారం అమరావతిలోని సచివాలయ రెండో బ్లాక్‌లో అనిత హోం, రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు, సిఎం చంద్రబాబు ఆశీస్సులతో రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతానని అన్నారు. పోలీసుల్లో గత ప్రభుత్వ ఆలోచనలతో ఉన్నవారుంటే పక్కకు తప్పుకోవాలని సూచించారు. ప్రజలకు అనుకూలంగా పోలీసులు పనిచేయాలని కోరారు. పోలీసులు రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. సోషల్ మీడియాలో మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులన్నిటిపై విచారణ జరిపిస్తామని అన్నారు. బాధితులు కేసులు రీ ఓపెన్ చేయాలని కోరితే తప్పకుండా చేస్తామన్నారు. ఈ సందర్భంగా డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి విజయకుమార్, ఇంటెలిజెన్స్ అదనపు డిజి కుమార విశ్వజిత్, రైల్వేస్ డిజి త్రిపాఠి ఉజాల, అడిషనల్ డిజి శంఖబ్రత బాగ్చీ, ఎపిఎస్‌పి అదనపు డిజి అతుల్ సింగ్, డిఐజి రాహుల్‌దేవ్ శర్మ, ఎస్ఐబి ఐజి రవి ప్రకాష్, పోలీస్ పర్సనల్ ఐజి పి వెంకట్రామిరెడ్డి, ఎస్‌పిఎఫ్ ఐజి త్రివిక్రమ వర్మ, డిఐజి రాజకుమారి తదితరులు మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలిపారు.

2047 నాటికి 'సికిల్‌సెల్ ఎనీమియా' నిర్మూలన

- వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- కాంతిలాల్ దండే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించడమే లక్ష్యంగా 2023లో కేంద్ర ప్రభుత్వం మిషన్‌ను ప్రకటించిందని గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులందరికీ ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. గిరిజన జనాభాలో ప్రతి 86 మందిలో ఒకరికి సికిల్‌సెల్ (వ్యాధి) రక్తహీనత (ఎనీమియా) ఉందని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్‌లో బుధవారం సికిల్‌సెల్ ఎనీమియా మిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు స్క్రీనింగ్ టెస్టులు ఇప్పటికే మొదటి దశ పూర్తయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశవ్యాప్తంగా సికిల్‌సెల్ ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 ఏళ్ల మధ్య వయసున్న 7 కోట్ల మందికి అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించడమే సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 19న ప్రపంచ సికిల్‌సెల్ అవేర్‌నెస్ డేను పాటిస్తున్నారని తెలిపారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు.

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టరు జె వెంకట మురళి మాట్లాడుతూ.. సికిల్‌సెల్ ఎనీమియా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోందన్నారు. నిర్మూలన మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని వైద్యారోగ్య కుటుంబ సంక్షేమం, మహిళా, శిశు, గిరిజన సంక్షేమశాఖల సమన్వయంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు, మెడికల్, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సలహాదారుల కోసం కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సలహాదారుల నియమాకానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పరిపాలనానుభవం ఉండి, తమకు నమ్మకస్తులుగా ఉండే ఐఎఎస్, ఐపిఎస్ అధికారులవైపు ప్రభుత్వ పెద్దలు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు గతంలో ఫైనాన్స్, ప్లానింగ్ విభాగంలో అనుభవమున్న టక్కర్, అవినీతి నిరోధకశాఖలో పట్టుఉన్న ఆర్‌పి ఠాకూర్, హోం శాఖపై పట్టు ఉన్న ఎబి వెంకటేశ్వరరావును నియమించే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు తెలిసింది. క్యాట్ చెప్పినప్పటికీ గత ప్రభుత్వం ఎబి వెంకటేశ్వరరావుకు పోస్టింగ్ ఇవ్వకుండా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీరితో పాటు వైసిపి ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారులకు నూతన ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పజెప్పే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు సమాచారం. గతంలో ఇన్వెస్టిమెంట్ బోర్డు ఛైర్మన్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన జాస్తి కృష్ణకిశోర్‌ను కూడా ప్రభుత్వ సలహాదారునిగా నియమించుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే హైకోర్టులో ఎజి శ్రీరామ్ స్థానంలో దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఎఎజి, పిపిలు ఇప్పటికే ఆపదవులకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. వీరి స్థానంలో ఒకటి రెండు రోజుల్లో ఇతరులను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వానల్లో కరువు పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. నెల్లూరు జిల్లాలో పది మండలాల్లో, కర్నూలు జిల్లాలో 18 మండలాల్లో, అనంతపురం జిల్లాలో 14 మండలాల్లో, సత్యసాయి జిల్లాలో ఒక మండలం, ప్రకాశం జిల్లాలో 31 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ఈ మండలాల్లో 2.52 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, దీని వలన రూ.228.03 కోట్లు రైతులు నష్టపోయారని కేంద్ర కరువు బృందానికి రాష్ట్ర అధికారులు వివరించారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ రీతేష్ చౌహాన్ నేతృత్వంలో కేంద్ర బృందం సభ్యులు రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై అధికారులను పలు ప్రశ్నలు వేశారు.

రైతాంగాన్ని ఆదుకోండి

కరువు బారిన పడిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కేంద్ర కరువు బృందాన్ని కోరింది. కర్నూలులో ఆ సంఘ జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ నేతృత్వంలో పలువురు రైతులు బృంద సభ్యులను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పంటల వారిగా రైతులు నష్టపోయిన తీరును వివరించారు.

ఖరీఫ్ పెట్టుబడి కోసం తిప్పలు

- పేరుకుపోయిన రబీ ధాన్యం బకాయిలు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.508 కోట్లపైనే పెండింగ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అనేక ఒడిదుడుకులను తట్టుకుంటూ సాగు చేస్తున్న రైతన్నలకు నిత్యం కష్టాలు తప్పడం లేదు. రబీ సీజన్‌లో ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా డబ్బులు మాత్రం చేతికందడం లేదు. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీ భారం ఒకవైపు, ఖరీఫ్ సీజన్ సాగు కోసం మళ్లీ అప్పుల కోసం రుణదాతలను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.508.79 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉంది.

రబీ సీజన్‌లో 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇందులో స్థానిక అవసరాలు మినహా మిగిలిన 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో ఏప్రిల్ 4న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఏప్రిల్ 20 వరకు కొనుగోళ్లు జరగలేదు. సాధారణ రకం (75 కేజీలకు) రూ.1,637, గ్రేడ్-ఎ రకం (75 కేజీలకు) రూ.1,652 చొప్పున మద్దతు ధరను ప్రకటించారు. ప్రభుత్వ నిబంధనలు, ఇతర కారణాల వలన కొనుగోలు కేంద్రాల ద్వారా నామమాత్రంగానే అధికారులు ధాన్యాన్ని సేకరించారు. తేమశాతం, నాణ్యత, వాతావరణ ప్రతికూలతలు చూపి దళారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

బకాయిలు.. రూ.508 కోట్లు

ధాన్యం అమ్మిన సొమ్మును 48 గంటల్లోనే జమ చేయాలని మొదట్లో నిర్ణయించారు. ఆ తర్వాత మూడు వారాలకు గడువు పెంచారు. అయినా నిబంధనల మేరకు డబ్బుల చెల్లింపులో నిర్లక్ష్యం చోటుచేసుకుంటుంది. గత నెల 1 నుంచి కొన్ని కారణాల రీత్యా చెల్లింపులు నిలిచినట్లు సమాచారం. ఎన్నికల హడావుడిని సాకుగా చూపి రైతులకు ఇవ్వాల్సిన బకాయిల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాకినాడ జిల్లాలో 6.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా ఉండగా లక్ష్యం మాత్రం 1.92 లక్షల టన్నులు మాత్రమే సేకరించారు. ఇందులో 3,110 మంది రైతుల నుంచి రూ.57.18 కోట్లు విలువైన 26,180.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా ఇప్పటి వరకు రూ.20.37 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.36.81 కోట్లు బకాయిలు ఇవ్వాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో 23,082 మంది రైతుల నుంచి 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా రూ.498.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.296.31 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ. 202.41 కోట్లు ఇంకా జమ కావాల్సి ఉంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రూ.355.84 కోట్లు విలువైన 1.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రూ.84.47 కోట్లు చెల్లించగా ఇంకా రూ.270.20 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.



ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్న రైతులు (ఫైల్)

తక్షణమే బకాయిలను విడుదల చేయాలి

ధాన్యం అమ్మిన సొమ్మును ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి. 21 రోజుల్లోపు జమ చేయాల్సిన సొమ్ములు నెలా, రెండు నెలలు గడిచినా ఖాతాల్లో వేయకపోవడం దారుణం. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలి.

– తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

24న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 24న నూతన ప్రభుత్వం తొలి మంత్రివర్గ సమావేశం జరగనుంది. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన భేటీ నిర్వహించనున్నారు. సమావేశానికి సంబంధించిన అంశాలపై ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం పేర్కొంది. మొదటి కేబినెట్ సమావేశంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, పింఛను పెంపు, మెగా డిఎస్‌సి, స్కిల్ సెంటర్లు వంటి అంశాలపై మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఆమోదముద్ర వేయనుంది.

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి

- జిఒ 3 పునరుద్ధరణ హామీ నెరవేర్చండి
- మంత్రి సంధ్యారాణికి గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి-సాలూరు

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నిర్వహణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం కోరింది. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాసంలో బుధవారం ఆమెను కలిసిన గిరిజన సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. ... 2024 డిసెంబర్ 31 నాటికి నియామకపు ప్రక్రియ పూర్తిచేయాలని విద్యాశాఖను ఆదేశించిన 5వ షెడ్యూల్ ఏరియాలో వంద శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ... జిఒ నెంబర్ 3 రిజర్వేషన్ పునరుద్ధరణ చేస్తామని టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ... ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పల నర్స, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొద్దు బాల్ దేవ్, జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, ఆదివాసీ మాతృభాష విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకులు మర్రి చిట్టి బాబు ఉన్నారు.




మంత్రి సంధ్యారాణికి వినతినిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు

ఆశావహ దృక్పథంతో ముందుకు


- ఎన్‌జి రంగా విద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వ్యవసాయమంటే కేవలం ఆహారోత్పత్తి మాత్రమే కాదని, ఎందరి జీవితాలనో పోషించడమనే వాస్తవాన్ని విద్యార్థులు గ్రహించి, ఆశావహ దృక్పథంతో ముందడుగు వేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ... ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 56వ వార్షిక స్నాతకోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ... విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు నరేంద్రవర్మ, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్నాతకోత్సవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు, తదితరులు

సత్తిరాజు మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

ప్రజాశక్తి - పాలకొల్లు

సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నేత కూనపరాజు సత్యనారాయణరాజు (సత్తిరాజు) మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సత్తిరాజు సంతాప సభ బుధవారం ఆయన స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా ఆచంటవేమవరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ... ఈ కార్యక్రమంలో ... పాల్గొన్నారు.

కేంద్రానికి భారీ డిమాండ్లు


- శాఖలవారీగా అధికారుల కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం నుంచి మరిన్ని నిధులు సాధించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. గతంలో వివిధ పథకాలకు (గ్రాంట్లు, రుణాలు, పథకాలకు వాటా నిధులు వచ్చిన నిధుల కన్నా అధికంగా పొందేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు అవసరం ఉన్న పథకాల జాబితాను సిద్ధం చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వంలో బిజెపి కూడా భాగస్వామిగా ఉండటంతో కేంద్రం నుంచి అధిక నిధులు వస్తాయని అధికారులు ఆశతో ఉన్నారు. పోలవరం పూర్తిచేసేందుకు ఈ ఏడాది ఎక్కువ నిధులు కావాలని కోరనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ... ఈ ఏడాది రూ.2,500 కోట్ల వరకు నిధులు కోరనున్నట్లు తెలుస్తోంది. ... ఈ మేరకు శాఖల వారీ నిధుల అవసరాలపై నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం ప్రతియేటా రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. ... 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. ... 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన ... ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్టు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేల నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా
ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501,
ఇ మెయిల్ అడ్రస్: psmhaward@gmail.com

సంపాదకీయం

తీరు మారని బిజెపి

సాధారణ ఎన్నికల్లో దేశ ప్రజానీకం మొట్టికాయ వేసి, మెజార్టీ కోసం ఇతర పార్టీలపై ఆధారపడేటట్లు చేసినా నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వ తీరులో మార్పు కనపడటం లేదు. గతంలో మాదిరి అవే ఏకపక్ష విధానాలు, నిరంకుశ పోకడలను కొనసాగిస్తోంది. ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌పై ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) ప్రయోగానికి అనుమతి ఇవ్వడమే దీనికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె సక్సేనా ఈ మేరకు జారీ చేసిన ఆదేశాలు దేశవ్యాప్తంగా ఇప్పుడు చర్చనీయాంశమైనాయి. అరుంధతీ రాయ్‌తో పాటు కాశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోఅంతర్జాతీయ న్యాయశాస్త్ర మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను కూడా ఈ చట్టం కింద విచారణకు గవర్నర్ అనుమతించారు. ఇది ఇప్పటి కేసు కాదు. పోలీసులు చెబుతున్న ఈ సంఘటన జరిగి పుష్కర కాలం దాటిపోయింది. ఎప్పుడో 14 సంవత్సరాల క్రితం జరిగి సంఘటనను తవ్వి తీసి, ఏకంగా ఉపా వంటి క్రూరమైన చట్టాన్ని ప్రయోగించడానికి సిద్ధం కావడంలోనే కేంద్ర ప్రభుత్వ కుటిలత్వం స్పష్టమౌతోంది. ఈ ఫైలే గత ఏడాది గవర్నర్ ముందుకు వచ్చినప్పుడు ఉపా చట్టం కింద కేసు పెట్టాలన్న పోలీసుల ప్రతిపాదనను గవర్నర్ తిరస్కరించారు. అప్పట్లో ఐపిసి సెక్షన్ల కింద మాత్రమే కేసు నమోదు చేయాలని ఆదేశించడం గమనార్హం. 2010లో న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడారన్నది అరుంధతీ రాయ్ ప్రభృతులపై ఆరోపణ! అదే జరిగి ఉంటే, ఆ ఉపన్యాసాల కారణంగానే వేర్పాటువాదం ఈ 14 ఏళ్ల కాలంలో బలపడిందని పోలీసులు ఆధారాలు చూపాలి. అవేమీ లేవు. పైగా తాము అధికారంలోకి వచ్చిన తరువాత వేర్పాటువాదాన్ని అణచి వేశామని, కాశ్మీరాన్ని భూతల స్వర్గం చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా లు పదే పదే దేశ వ్యాప్తంగా చాటింపు వేస్తూనే ఉన్నారు. అయినా, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రచయిత్రి, హక్కుల ఉద్యమకారిణిపై అతి క్రూరమైన చట్టం కింద కేసు పెట్టడానికి బరితెగించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంకేతాలేమిటి?

ఈ కేసు విషయంలోనే కాదు. అనేక ఇతర అంశాల్లోనూ మోడీ సర్కారు పోకడలు ఇదే మాదిరి ఉన్నాయి. పార్లమెంటులో సాధారణ మెజార్టీ కోసం జనతాదళ్(యు), టిడిపి లపై బిజెపి ఆధారపడి ఉంది. అయినా, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి కీలక అంశాలపై ఒక్క సానుకూల ప్రకటనయైనా నరేంద్ర మోడీ చేయకపోవడం గమనార్హం. గడిచిన పదేళ్ల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానాలకు వ్యతిరేకంగానే దేశ ప్రజానీకం సాధారణ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. ఈ విషయం సుస్పష్టం. అయినా, ఆయన ఏర్పాటు చేసిన మంత్రి వర్గంలో ఇసుమంత మార్పు కూడా లేదు. గతంలో ఉన్న మంత్రులనే తీసుకోవడంతో పాటు, వారికి ఆ శాఖలనే అప్పగించారు. మంత్రి వర్గంలో ఒక్క ముస్లింకూ స్థానం ఇవ్వలేదు. ఇతర అధికారులే లేరన్నట్లు గతంలో పనిచేసిన పి.కె మిశ్రాను ముఖ్య కార్యదర్శిగా, జాతీయ భద్రతా సలహాదారునిగా అజిత్ దోవల్‌ను తిరిగి నియమించారు. వీటన్నింటి అర్థం మతతత్వ-కార్పొరేట్ విధానాల్లో ఎటువంటి మార్పు లేదని స్పష్టంగా చెప్పడమే. మతతత్వ విధానాల కారణంగా రక్తపుటేరుల్లో మునిగిన మణిపూర్‌ను సందర్శించి, బాధితులకు అండగా ఉండటానికి ఇప్పటికీ ప్రయత్నం చేయడం లేదు.

మరోవైపు సంఘ్‌పరివార్, హిందుత్వ శక్తులు చెలరేగి పోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఒడిషాలోని బాలాసోర్‌లో బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు ఒక వ్యూహం ప్రకారం మతఘర్షణలను రెచ్చగొట్టాయి. ఉత్తరప్రదేశ్‌లో గోగూండాలు దాడులకు దిగుతున్నారు. అరుంధతీ రాయ్‌పై ఉపాను ప్రయోగించడం ప్రజల పక్షాన నిలబడి, గొంతు విప్పి, పోరాడే ప్రతి ఒక్కరికి ఒక హెచ్చరిక వంటిది. ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా కదిలి ఈ దాడిని తిప్పికొట్టడంతో పాటు రానున్న రోజుల్లోనూ అప్రమత్తంగా ఉండాలి. ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరచాలి. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకునేందుకు ప్రజలు, ప్రజాతంత్ర శక్తులు సదా జాగరూకులై వుండాలి.

మహనీయుల మాట



మహిళల శ్రమ పట్ల ప్రత్యేకంగా పెట్టుబడిదారులు ఆకర్షితులు కావడానికి కారణం...అది చౌకగా లభించడం మాత్రమే కాదు. వారు చాలా అణకువగా వుండడం కూడా.

- క్లారా జెట్కిన్,


జర్మన్ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త.
జననం: 5.7.1857
మరణం: 20.6.1933



పెట్టుబడి ప్రపంచవ్యాప్త విస్తరణ - సామ్రాజ్యవాదం



ప్రభాత్ పట్నాయక్



నయా ఉదారవాదం ప్రభుత్వ జోక్యాన్ని సహించదు. జాతీయ, అంతర్జాతీయ బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మాత్రమే ఏ ప్రభుత్వమైనా పని చేయాలి తప్ప అంతకు మించి స్థానిక ప్రజల ప్రయోజనాల కోసం ఏ ప్రభుత్వమైనా పూనుకుంటే అది ఒప్పుకోదు. కనుక రైతులకు, చిన్న ఉత్పత్తిదారులకు అండగా ఏ ప్రభుత్వమైనా చర్యలు చేపడితే అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. దాంతో సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడుల పెంపు వంటివి వెనకపట్టు పడతాయి. ఆ పరిస్థితుల్లో దేశీయంగా ప్రజల వినియోగాన్ని తగ్గించినప్పుడే ఆ వ్యవసాయోత్పత్తులు పెట్టుబడిదారులకు తగినంత పరిమాణంలో, చౌకగా లభిస్తాయి. అందుకోసం ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించాలి. ఎటువంటి పీడనా లేకుండా ఈ పని చేయడం సాధ్యం కాదు. అటువంటి పీడన ఫలితంగానే మూడవ ప్రపంచ దేశాలలో తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తి గాని, వాటి తలసరి వినియోగం గాని తగ్గిపోతున్నాయి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం గణనీయమైన స్థాయిలో విస్తరణ జరుగుతోంది. అమెరికా ఆధ్వర్యంలో ఇంతవరకూ నడుస్తూ వచ్చిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఈ విధంగా "బహుళ ధృవ ఆర్థిక వ్యవస్థ"గా విస్తరించడం ఒక పెద్ద మార్పు అని చాలామంది అంటున్నారు. ఈ విధంగా వర్ణించడం పట్ల ఎవరికి ఏ విధమైన అభిప్రాయం ఉన్నా, ఆర్థిక వ్యవస్థ విస్తరించడం అనేది నిస్సందేహంగా జరుగుతోంది. 1994 నాటికి జి-7 దేశాలు (అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, ఇటలీ, కెనడా) అన్నీ కలిసి ప్రపంచ ఉత్పత్తిలో 45.3 శాతాన్ని ఉత్పత్తి చేయగా, బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, చైనా, ఇండియా, దక్షిణాఫ్రికా) తమతో కొత్తగా కలిసిన ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఈజిప్ట్, ఇథియోపియా లను కలుపుకుని 18.9 శాతం ఉత్పత్తిని చేశాయి. అదే 2022 నాటికి జి-7 దేశాలు 29.3 శాతం, బ్రిక్స్ దేశాలు 35.2 శాతం చొప్పున ఉత్పత్తి చేశాయి (ఇవి ప్రపంచబ్యాంక్ లెక్కలు).

అమెరికా, బ్రిటన్, కెనడా, యూరోపియన్ యూనియన్ దేశాలు, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లను కలిపి చూసినా, వాటి ఉత్పత్తి శాతం 1994లో 56 ఉండగా 2022 నాటికి 39.5కి తగ్గింది. అమెరికా మాత్రం ఈ విస్తరణ పర్యవసానాలను జీర్ణించుకోడానికి సిద్ధంగా లేదు. అందుకే పాత రోజుల్లో మాదిరిగానే తన పెత్తనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద పాత పద్ధతుల్లోనే సాగించడానికి చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. ఈ దూకుడు ముఖ్యంగా రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాల విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ దూకుడు వల్ల ప్రపంచం అత్యంత ప్రమాదకరమైన సైనిక ఘర్షణలకు దారి తీస్తోంది.

సోషలిస్టు వ్యవస్థ తలెత్తడం ఈ ఉత్పత్తి విస్తరణకు చాలా దోహదం చేసింది. సోషలిజం ఉనికి లోకి రావడంతో వలస విధానం అంతరించడం వేగంగా జరిగింది. ఆ దేశాల్లో దేశీయంగా నైపుణ్యాలు పెంపొందడం, సాంకేతిక సామర్థ్యం, మౌలిక వసతుల కల్పన, ఉత్పత్తి సామర్థ్యం పెరగడానికి సోషలిస్టు వ్యవస్థ తోడైంది. ఆ ప్రభుత్వాల నియంత్రణలో ఆర్థిక వ్యవస్థలు నిర్వహించడం అనేది ఈ అభివృద్ధితో నిలదొక్కుకుని పాశ్చాత్య దేశాల శతృపూరిత వైఖరిని ఎదుర్కోగల శక్తిని వాటికి కల్పించింది. సోవియట్ యూనియన్ లోను, తూర్పు యూరప్ దేశాలలోను సోషలిస్టు వ్యవస్థలు పతనం చెందాక, ప్రభుత్వ నియంత్రణలో మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు నిర్వహించడం అనేది మారిన తర్వాత అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహాలు వేగంగా సాగడంతో ఉత్పత్తి ప్రపంచవ్యాప్త విస్తరణ అనేది కొనసాగింది. ఇందుకు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు తోడ్పడ్డాయి. అప్పటికే ప్రభుత్వ నియంత్రణలో ఆ యా దేశాల ఆర్థిక వ్యవస్థలు నడిచినప్పుడు పెంచుకున్న ఉత్పత్తి సామర్థ్యాలు, మౌలిక వసతులు వగైరా ఉండడంతో నయా ఉదారవాద వ్యవస్థలో ఉత్పత్తి విస్తరణ సులభ సాధ్యం అయ్యింది. ఇప్పుడు అమెరికా నాయకత్వం లోని కూటమి పరిధికి వెలుపల ఉత్పత్తి విస్తరణ పెట్టుబడిదారీ వ్యవస్థలోనే సాగుతోంది (చైనా సంగతి వేరు. దానిని ప్రత్యేకంగా చూడాలి).

ప్రస్తుత పరిస్థితుల్లో సామ్రాజ్యవాదాన్ని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అన్నది ఇప్పుడు తలెత్తే ప్రశ్న. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సామ్రాజ్యవాదంతోబాటే అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు, వెనుకబడిన తక్కిన దేశాలు అన్న విభజన కూడా ఏర్పడింది. ఇప్పుడు ఆ విభజన రేఖ చెదిరిపోయి, ఇంతవరకూ వెనుకబడిన దేశాలలో ఉత్పత్తి పెరుగుదల రేటు వేగంగా, సంపన్న దేశాలను సైతం అధిగమించి ముందుకు సాగిపోతూ వుంటే, ఇంకా సామ్రాజ్యవాదం గురించి ఎలా మాట్లాడగలం? వెనుకబడ్డ దేశాలు సంపన్న దేశాల స్థాయిని అందుకుంటున్నప్పుడు, అది కూడా పెట్టుబడిదారీ చట్రం లోపలే జరుగుతున్నప్పుడు (చైనా ఇందుకు మినహాయింపు) ఇక పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచంలో అసమాన అభివృద్ధికి దారి తీసిందంటూ దానిని నేరస్థురాలిగా ఎలా నిలబెడతాం? ఇదీ ఆ ప్రశ్న. ఐతే ఈ ప్రశ్న కరెక్టేనా?

మొట్టమొదటగా, ఉత్పత్తి విస్తరణ అనేది స్పష్టంగా కనిపిస్తున్నా, వెనుకబడిన దేశాలు సైతం సంపన్న దేశాల స్థాయిని అందుకుంటున్నాయని నిర్ధారించడం అతిగా భావించడమే ఔతుంది. జరుగుతున్న ఉత్పత్తి విస్తరణను అతిగా పరిగణించడమే దీనికి కారణం. ఈ విస్తరణ జరుగుతున్న దేశాల సంఖ్య ఇప్పటికీ చాలా తక్కువగానే ఉంది. ఈ దేశాలలో కూడా పరిస్థితులు తారుమారయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఎందుకంటే నయా ఉదారవాద వ్యవస్థలో తలెత్తిన సంక్షోభం ఫలితంగా ఈ దేశాలన్నీ రుణాల వలలో చిక్కుకున్నాయి. ఆ రుణాలతోబాటు వచ్చే షరతులను పాటించవలసి వస్తోంది. ద్రవ్య వినిమయంలో పొదుపు పాటించడం, దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని లేకుండా చూడడం ఆ షరతులలో భాగం. వాటిని అమలు చేసినందువలన ఈ దేశాలలో ఉత్పత్తి పెరుగుదల నిలిచిపోవడమే గాక దిగజారడం కూడా మొదలౌతుంది. చరిత్రలో ఈ విధంగా జరిగిన అనుభవాలు మన ముందున్నాయి. ముఖ్యంగా ఖనిజ సంపద కలిగి ఉన్న దేశాలకు ఇటువంటి అనుభవాలు ఎదురయ్యాయి. మయన్మార్ ఇందుకు ఒక ఉదాహరణ. ఒకప్పుడు ఆ దేశం అభివృద్ధిలో చాలా ముందుకు పోతున్నట్టు భావించారు. కాని ఇప్పుడు అతి తక్కువ అభివృద్ధి నమోదైన దేశాల్లో ఒకటిగా మయన్మార్ ఉంది. మన పొరుగు దేశాల్లో కూడా విదేశీ రుణ భారం ఫలితంగా దిగజారిపోవడం కనిపిస్తోంది.

సంపన్న దేశాల స్థాయికి మూడవ ప్రపంచదేశాలు చేరుకోవడం అనేది సాధ్యం కాదు. దీనికి ప్రధాన కారణం సామ్రాజ్యవాదమే. దీనిని అర్థం చేసుకోవాలంటే ఉత్పత్తి విస్తరణ తోబాటు ప్రస్తుత నయా ఉదారవాద శకంలో మూడవ ప్రపంచ దేశాలలో పెరుగుతున్న పౌష్టికాహార లేమిని కూడా పరిశీలించాలి. ఒకవైపు సంపన్న దేశాల నుండి మూడవ ప్రపంచ దేశాలకు ఉత్పత్తి విస్తరిస్తూంటే, దాని ఫలితంగా అవి సంపన్న దేశాల కన్నా అధికంగా వృద్ధిరేటు పెరుగుదలను నమోదు చేస్తూంటే మరోవైపు ప్రజలకు పౌష్టికాహార లభ్యత తగ్గిపోతోంది. ఈ వాస్తవాన్ని మసిపూసి మారేడుకాయ చేసి కేవలం ఉత్పత్తి విస్తరణను మాత్రమే గొప్పగా చిత్రించే ప్రయత్నాన్ని ప్రపంచబ్యాంకు చేస్తోంది. పౌష్టికాహారం లేకపోవడం అంటే దానర్థం ఇక్కడ నికరంగా పేదరికం పెరిగిపోవడమే. మూడవ ప్రపంచ దేశాలలో ప్రజలకు నయా ఉదారవాద శకంలో మెరుగైన రోడ్లు, విద్యుత్తు, ఇతర మౌలిక వసతులు అభివృద్ధి చెంది వుండొచ్చు. కాని, వ్యక్తిగత వినిమయం స్థాయి పడిపోయింది. సోషలిస్టు వ్యవస్థ, దాని ఊతం తో మూడవ ప్రపంచ దేశాలలో ప్రభుత్వ నియంత్రణలో నడిచిన ఆర్థిక వ్యవస్థలు పతనం కావడం, నయా ఉదారవాద ఆధిపత్యం ప్రపంచం అంతా బలపడడం జరిగిన కాలంలోనే మూడవ ప్రపంచ దేశాల ప్రజల వినిమయ స్థాయి పడిపోయింది.

అందుచేత సంపన్న దేశాల సరసన మూడవ ప్రపంచ దేశాలు సైతం చేరుతున్నాయి అని నిర్ధారించడం అంటే పరిస్థితిని తప్పుగా అర్థం చేసుకోవడమే. మహా అయితే, పెట్టుబడిదారీ ప్రపంచానికి, దానికి వెలుపల ఉన్న ప్రపంచానికి నడుమ ఉండే విభజన రేఖ చెరిగిందని, ఆ విభజన రేఖ కాస్తా ఇప్పుడు పెట్టుబడిదారీ ప్రపంచం లోపలే కనిపిస్తోందని నిర్ధారించవచ్చు. మూడవ ప్రపంచ దేశాలలోని బడా పెట్టుబడిదారీ వర్గం ఇప్పుడు సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని పెట్టుబడిదారుల సరసన చేరారు. గతంలో వీరు తమ తమ దేశాల్లోని ప్రజలతో బాటు నిలిచి వలస పెత్తనానికి వ్యతిరేకంగా నడిచారు.

సామ్రాజ్యవాదం అంటే ఒక భౌగోళికమైన విభజనగా అర్థం చేసుకోకూడదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ పరిసరాల మీద సాగించే పీడన రూపమే సామ్రాజ్యవాదం. అదొక రాజకీయ అర్థశాస్త్రపు భావనే తప్ప భౌగోళికంగా అర్థం చేసుకోవలసినది కాదు. అందుచేత రాజకీయ అర్థశాస్త్రం లోని కొన్ని అంశాలను ఇక్కడ మళ్ళీ గుర్తు చేసుకోవడం అవసరం.

పారిశ్రామిక విప్లవం తర్వాత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కొత్త రూపం తీసుకుంది. బ్రిటన్‌లో జౌళి పరిశ్రమతో ఇది మొదలైంది. ఐతే బ్రిటన్‌లో జౌళి పరిశ్రమకు కావలసిన పత్తి ఉత్పత్తి సాధ్యం కాదు. అదే విధంగా తమ దేశాలలో ఉత్పత్తి చేయడం సాధ్యం కాని లేదా ఒకవేళ ఉత్పత్తి చేయగలిగినా తమ పరిశ్రమల అవసరాలకు సరిపడా ఉత్పత్తి చేయలేని వివిధ రకాల ముడి సరుకుల కోసం ఉష్ణ మండల దేశాల మీద పెట్టుబడిదారీ దేశాలు ఆధారపడవలసి వచ్చింది. ఈ ఉష్ణ మండల దేశాలలో ఏడాది పొడవునా పంటలు పండుతాయి. అందుచేత చారిత్రికంగా అక్కడ జనాభా కూడా ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ దాదాపుగా పెట్టుబడిదారీ దేశాలకు వెలుపలే ఉన్నాయి. కాలక్రమంలో ఈ ప్రాంతాలకు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరించినప్పటికీ, అక్కడి స్థానిక పెట్టుబడిదారులతోబాటు, సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని పెట్టుబడిదారులు కూడా ముడిసరుకుల కోసం ఈ ఉష్ణమండల దేశాలలోని రైతాంగం మీదనే ఆధారపడక తప్పలేదు. ఆ రైతులు పండించే ఉత్పత్తుల ధరలు దశాబ్దాలుగా పెరగలేదు సరి కదా డాలర్ లెక్కల్లో చూస్తే తగ్గిపోయాయి.

ఈ వ్యవసాయోత్పత్తుల ధరలు సాపేక్షంగా తక్కువగా ఉండడం అనేది వాస్తవానికి పెట్టుబడిదారీ పీడన ఫలితమే. దశాబ్దాలుగా ఈ పీడన సాగుతోంది. మూడవ ప్రపంచ దేశాల్లో వ్యవసాయో త్పత్తులకు ఈ వ్యవస్థలో పెద్దగా ప్రాధాన్యత లేదు అన్నఒక తప్పుడు అభిప్రాయం ఏర్పడడానికి ఇది దారి తీసింది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ ఉత్పత్తులను ఉపయోగించకుండా తన మనుగడను కొనసాగించలేదు అన్నది సత్యం. ఉష్ణ మండల దేశాల్లో భూమి అంతా దాదాపు సాగులోకి ఎప్పుడో వచ్చేసింది. అందుచేత ఇక్కడ భూమి మీద వ్యవసాయం దిగుబడి ఇంకా పెరగాలంటే పంట దిగుబడిని పెంచుకోవడం ఒక్కటే మార్గం. ఆ పని చేయడానికి రైతాంగం మీద ఎటువంటి పీడననూ ప్రయోగించనవసరం లేదు. ఐతే దిగుబడి పెంచడానికి అవసరమైన సాగునీటి సదుపాయం, అధిక దిగుబడులనిచ్చే వంగడాలపై పరిశోధనలు వంటివి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరగాలి. రైతులు తమకు తాముగా జరపలేరు. కాని నయా ఉదారవాదం ప్రభుత్వ జోక్యాన్ని సహించదు. జాతీయ, అంతర్జాతీయ బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మాత్రమే ఏ ప్రభుత్వమైనా పని చేయాలి తప్ప అంతకు మించి స్థానిక ప్రజల ప్రయోజనాల కోసం ఏ ప్రభుత్వమైనా పూనుకుంటే అది ఒప్పుకోదు. కనుక రైతులకు, చిన్న ఉత్పత్తిదారులకు అండగా ఏ ప్రభుత్వమైనా చర్యలు చేపడితే అందుకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. దాంతో సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడుల పెంపు వంటివి వెనకపట్టు పడతాయి. ఆ పరిస్థితుల్లో దేశీయంగా ప్రజల వినియోగాన్ని తగ్గించినప్పుడే ఆ వ్యవసాయోత్పత్తులు పెట్టుబడిదారులకు తగినంత పరిమాణంలో, చౌకగా లభిస్తాయి. అందుకోసం ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించాలి. ఎటువంటి పీడనా లేకుండా ఈ పని చేయడం సాధ్యం కాదు.

అటువంటి పీడన ఫలితంగానే మూడవ ప్రపంచ దేశాలలో తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తి గాని, వాటి తలసరి వినియోగం గాని తగ్గిపోతున్నాయి. దీనికి తోడు ఆహార ధాన్యాలను బయో ఇంధనాల ఉత్పత్తికి మళ్ళించడంతో క్రమంగా తలసరి ఆహార ధాన్యాల లభ్యత కూడా తగ్గిపోతోంది. దీని పర్యవసానమే పౌష్టికాహార లేమి. అందుచేత మూడవ ప్రపంచ దేశాలకు ఉత్పత్తి విస్తరణ జరగడం అంటే అదేమీ సామ్రాజ్యవాదం అనే ధోరణికి వ్యతిరేకం కాదు. (స్వేచ్ఛానుసరణ)

చర్చ

ఆహార కల్తీతో అనారోగ్యం

డా. యం. సురేష్‌బాబు

కల్తీ ఆహారాలతో ప్రజారోగ్యం దెబ్బ తింటోంది. కల్తీ ఆహారం వల్ల దీర్ఘకాలంలో మధుమేహం, అధిక రక్తపోటు వంటి అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. జీర్ణకోశ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు దారితీస్తుంది. రోడ్డు పక్కన ఆహారాలు సాధ్యమైనంత వరకూ తినకపోవడమే మంచిది.

దేశంలో రోజు రోజుకూ ఆహార కల్తీ ఎక్కువ అయిపోతుంది. ఏది కొనాలన్నా తినాలన్నా భయపడే రోజులు వచ్చాయి. తమ వ్యాపారం పెంచుకునేందుకు ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. దీంతో వారి వ్యాపారమే కాదు, ఆస్పత్రులు కూడా నిండిపోతున్నాయి. టీ, కాఫీ, పాలు, పిండి, నూనెలు, మాంసం, కంది పప్పు, మిరియాలు, జీలకర్ర, బియ్యం ఇలా నిత్యం వినియోగించుకునే అన్ని పదార్థాలూ కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్టుంది పరిస్థితి. కాసుల కక్కుర్తితో కొందరు వ్యాపారులు సరుకులు కల్తీ చేస్తుండడం, వినియోగదారుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బ తీస్తోంది. నకిలీ వస్తువులను నియంత్రించాల్సిన విభాగాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. ఆహార పదార్థాలపై పన్నుల రూపంలో వసూలు చేస్తున్న మొత్తంలో నామమాత్రపు సొమ్మునైనా కల్తీ నియంత్రణ, నిరోధానికి ఖర్చు పెట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. నకిలీ సరకులపై న్యాయస్థానాలు స్వయంగా కేసుల్ని స్వీకరించి, మొట్టికాయలు వేసినా, అధికార యంత్రాంగం మందగమనం వీడలేదు. కల్తీ వస్తువులను విక్రయించే వారిపై దాడులు తూతూ మంత్రమే ఆపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వినియోగదారులు కూడా కల్తీ ఆహార వస్తువులేవో, అసలువేవో తెలుసుకోవడం అవసరం. ఇందుకు 'భారతీయ ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ' కొన్ని చిట్కాలు సూచిస్తోంది. త్వరగా కల్తీని గుర్తించే పరీక్ష (డి.ఎ.ఆర్.టి) పేరున వీటిని కరదీపికలో పొందుపరిచింది. ఈ మధ్యకాలంలో చికెన్ లాలిపాప్, పకోడీలో చికెన్ వేస్ట్ (కాళ్ళు, స్కిన్, పేగులు) కలపడం సాధారణం. హై వే దాబాలో మాంసంలో కుళ్ళినవి పెడుతున్నారని, చికెన్ బిర్యానీ బదులు కుక్క బిర్యానీ పెడుతున్నారని... చాలా వార్తలు చదువుతూనే ఉన్నాం. ఒక్క మాంసమే కాదు బయట చేసే ఫాస్ట్ ఫుడ్స్ అన్నింటిలో ఆహార కల్తీ ఉంటుంది. అన్నీ కూడా ఆహారంలో కల్తీ అవుతూనే ఉంటున్నాయి. పరిమితికి మించి రంగులు వాడకం ఎక్కువగా



ఉంటున్నది. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ కాఫీ, టీ స్టాళ్లలో సింథటిక్ పాలు వినియోగం ఎక్కువగా ఉంటున్నది. ఇక ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లలో కల్తీ నూనెలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. పానీ పూరీ చేసే ప్రాంతాలు అపరిశుభ్రంగా, పరమ భయంకరంగా వుంటాయి. ఫ్రూట్ సలాడ్, ఐస్ క్రీమ్, ఐస్, నూడుల్స్ తయారు చేసే ప్రదేశాలలో శుచి, శుభ్రత పాటించక అవి తిన్న వారు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ప్రతి రోజూ తనిఖీ చేయాలి. తయారీ కేంద్రాలను పరిశీలించాలి. ఎక్కువ మోతాదులో రంగుల వాడకాన్ని, కల్తీ పాల వాడకాన్ని నియంత్రించి తగిన చర్యలు తీసుకోవాలి. మన చేతిలో లేని పరిష్కారాల విషయానికి వస్తే రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి. లేకపోతే వ్యవసాయం చేసే సంఖ్య తగ్గి, కల్తీ ఇంకా పెరుగుతుంది. అలాగే రేట్లు ఇంకా ఇంకా పెరుగుతాయి. కల్తీ మీద ప్రచారం విస్తృతంగా పెరగాలి. వాటి వల్ల కీడు ప్రజలకు తెలియజేయాలి. అతిగా ఫెర్టిలైజర్ల వాడకం, క్యాన్సర్ కారణం అనే విషయాన్ని కూడా తెలియజేయాలి.

ఆరోగ్య తనిఖీ అధికారుల సంఖ్య పెరగాలి. వారి అధికారాలు పెరగాలి, కల్తీ చేసిన వారికి కఠిన శిక్షలు వుండాలి. అలాగే ప్రభుత్వం సేంద్రియ ఆహారాన్ని చౌకగా ఉండేట్లు చూడాలి. మంచి ఆహార అలవాట్లు, ఆరోగ్య అలవాట్లు వాటి వల్ల లాభాలు చెప్పి ప్రోత్సహించాలి. అప్పుడు ప్రజలు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెరుగుతుంది. రేట్లు తగ్గుతాయి. ఇళ్లలో, డాబాల మీద, పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి. ఆర్గానిక్ కూరగాయలు, పండ్లు పెంచుకోవాలి. బియ్యం, పప్పులు, ఉప్పు, చింతపండు సంవత్సరంలో రెండు సార్లు పెద్ద మొత్తంలో కొంటే కల్తీ బారి నుండి తప్పించుకోవచ్చు. ●

అభిప్రాయం

పేదరికమే బాలకార్మికులకు శాపమా?

డా. చిటికెన కిరణ్ కుమార్

సూరత్ లోని వజ్రాలు చెక్కుడు పరిశ్రమల్లో, శివకాశీ లోని మందుగుండు తయారీ పరిశ్రమల్లోనూ, జైపూర్ లోని రాళ్ల చెక్కుడు పనిలోనూ, ఫిరోజాబాద్ అద్దాల పరిశ్రమల్లోనూ, మురాదాబాద్‌లోని లోహ పరిశ్రమల్లోనూ, అలీగఢ్ లోని తాళాల పరిశ్రమల్లోనూ, మీర్జాపూర్ తివాచీల తయారీ శ్రమలోనూ, మార్కాపూర్ లోని పలకల తయారీ పరిశ్రమలోనూ హీనమైన, హేయమైన వాతావరణంలో బాల కార్మికులు పనిచేస్తున్నారు. పరిశీలించి చూస్తే ఈ పరిశ్రమలన్నీ ప్రమాద భరిత పనులకు సంబం ధించినవే. ఇటుక బట్టీల్లో పని చేసే పిల్లలు పెద్ద పెద్ద బరువులు మోస్తుంటారు. తరచుగా గాయ పడుతుంటారు. కొంత కాలానికి పూర్తిగా శక్తిని కోల్పోతారు. తివాచీ పరిశ్రమలో పనిచేసే బాలలు కంటి చూపును కోల్పోతున్నారు. శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడేవారు అనేకం. కాశ్మీరులోని తివాచీల పరిశ్రమలో పని చేస్తున్న వారిలో 60 శాతం మంది క్షయ, ఆస్తమా వ్యాధులతో బాధపడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఫిరోజాబాద్‌లోని గ్లాస్, గాజుల పరిశ్రమలో పనిచేసే పిల్లలు ఆస్తమా, బ్రాంకైటిస్, కంటికి సంబంధించిన రోగాలతో సతమతమవుతున్నారు. శివకాశీ లోని టపాకాయల పరిశ్రమలో పని చేసే బాలలు రోగాలతో పాటు పేలుడు లాంటి ప్రమాదాలకు బలైపోతున్నారు. భవన నిర్మాణ రంగంలో పని చేసే బాలలు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ యంత్రాలతో పనిచేసే వారు సరైన శిక్షణ, సరైన భద్రత లోపించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

2004-05లో జాతీయ నమూనా సర్వే అంచనా ప్రకారం దేశంలో 89 లక్షల మంది బాల కార్మికులున్నారు. 2009-10లో 5-14 ఏళ్ల వయసున్న బాలకార్మికుల సంఖ్య 49.84 లక్షలు. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మానేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో 63 శాతం దాకా ఉందని సమాచారం. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాల కార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థల సర్వే ప్రకారం దేశంలో ఆరు కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారు. అనధికారిక లెక్కలు చూస్తే 10 కోట్ల మంది ఉన్నట్లు తెలుస్తోంది. భారతదేశంలో మొత్తం బాలల జనాభాలో 14 శాతం మంది వివిధ పనుల్లో చెమటోడ్చుతున్నారు. మొత్తం కార్మికుల్లో 4 శాతం బాలలే. ప్రతీ పదిమంది బాలకార్మికుల్లో తొమ్మిది మంది వ్యవసాయ సంబంధిత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురవుతున్నారు. దాదాపు యాభై శాతం మంది ఏదో ఒక రూపంలో భౌతికంగా వేధింపులకు బాధితులవుతున్నారు. 50 శాతం మంది వారమంతా ఎలాంటి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. అందులో కొంత మంది ఏదో ఒక రూపంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారు. బాలకార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తారు కాబట్టి వారికి హక్కులు, కనీస వసతులు కూడా మృగ్యమే. తేలిగ్గా మోసానికి గురవడమే కాదు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. నిర్దిష్ట పని గంటలు లేవు. సెలవులు, బోనస్, పెన్షన్, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ లాంటి ఏ సామాజిక భద్రతా చర్యలు వర్తించవు. వేతనాలు అతి తక్కువ. పని పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి.

బాల కార్మికులుగా చిన్నారులు మారడానికి కారణాలను పరిశీలించినట్లయితే తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. పిల్లలు తమ మనుగడ కోసమే కాకుండా కుటుంబ అవసరాల కోసం పనిచేయాల్సిన దుస్థితి. పిల్లల్ని అదనపు ఆదాయం తెచ్చేవారిగా పేద కుటుంబాలు భావిస్తున్నాయి. ఎక్కువమంది తల్లితండ్రులు నిరక్ష్యరాస్యులు కావడం పిల్లల భవిష్యత్తు ప్రశార్థకంగా మారుతోంది. ఆర్థిక పరిస్థితి, అవగాహనా లోపం వల్ల ప్రాథమిక విద్యను



కూడా అందించలేకపోతున్నారు. సాంఘిక ఆర్థిక స్థితిగతులు (కుటుంబ పరిమాణం, నిరుద్యోగిత మొదలైనవి) బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రధాన లోపంగా చెప్పవచ్చు. భారీ పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల పల్లెల నుంచి పట్టణాలకు వలస వెళ్లడం. గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలు లేక పొట్ట కూటి కోసం వలస వెళ్లిన చోట పిల్లలను చదివించే పరిస్థితి ఉండదు. వారు కూడా బాల కార్మికులుగా మారడం అనివార్యం అవుతున్నది. దీనికి తోడు ప్రస్తుత విద్యావిధానంపై అవగాహన కల్పించకపోవడం, పేద కుటుంబాలకు ఉపాధి కల్పించకపోవడం ప్రభుత్వాల ఘోర వైఫల్యం. అదే విధంగా పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరంగా చూడకపోవడం, ఇది సాధారణ విషయంగా ప్రస్తుత సమాజం భావించడం ఈ వ్యవస్థ బలోపేతం కావడానికి మరో కారణం. పలక, బలపం పట్టాల్సిన చేతులు పలుగు, పార పట్టడం అత్యంత శోచనీయం. దీనికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవడం, వారిని చక్కదిద్ది బడికి పంపడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. అంతేకాదు, బాల కార్మికులు పనిచేసే ప్రతి చోటా పౌర సమాజం కూడా దీన్ని వ్యతిరేకించడం, అవసరమైన దగ్గర ఉద్యమించడం చేయాలి. అప్పుడే ఈ పరిస్థితి నుంచి కొంతైనా బయటపడగలం. భావిభారత పౌరుల ముఖాల్లో వెలుగుల్ని చూడగలం. ●

నిజమైన రైతు ప్రతినిధులతో చర్చలు జరపండి : ఎస్‌కెఎం

న్యూఢిల్లీ : నిజమైన రైతు ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) డిమాండ్ చేసింది. కేంద్ర బడ్జెట్ 2024-25 కోసం ఆలోచనలు, సూచనలు సేకరించేందుకు వివిధ భాగస్వాములతో కేంద్ర ఆర్థిక మంత్రి వ్యక్తిగతంగా సమావేశం కానున్నారని, ఇందులో భాగంగా ఈ నెల 21న రైతు సంఘాలు, వ్యవసాయ ఆర్థికవేత్తలతో కేంద్ర మంత్రి సమావేశం ఉందనే వార్తల నేపథ్యంలో ఎస్‌కెఎం ఈ డిమాండ్ చేసింది. తీవ్రంగా ఉన్న వ్యవసాయ సంక్షోభం పరిష్కారానికి సంబంధించిన ప్రతిపాదనలతో ఎస్‌కెఎం ఇప్పటికే మెమొరాండం సమర్పించినట్లు తెలిపింది. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) కూడా కనీస మద్దతు ధరలను నిర్ణయించడానికి, వ్యవసాయ ఖర్చులు తగ్గించడానికి ప్రతిపాదనలు సమర్పించింది. అయినప్పటికీ, ఆర్థిక మంత్రితో సమావేశానికి ఎస్‌కెఎం, ఎఐకెఎస్ ప్రతినిధులకు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఇంకా ఆహ్వానం పంపలేదని ఎస్‌కెఎం గుర్తు చేసింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానంతో ఉద్దేశపూర్వకంగానే నిజమైన రైతు ప్రతినిధులను పక్కన పెట్టడం, రైతు సమస్యలపై కంటి తుడుపు చర్యలు తీసుకోనుందని స్పష్టమవుతుందని ఎస్‌కెఎం విమర్శించింది. ఈ విధానాన్ని ఎస్‌కెఎం ఖండించింది. మోడీ ప్రభుత్వం తన అహంకారాన్ని విడిచిపెట్టాలని, 159 గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలని హితవు పలికింది. అలా కాకపోతే, రైతుల నుంచి భారీ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది.

రాహుల్‌గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన 'ఇండియా'

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ 54వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా ఇండియా వేదికలోని పలు పార్టీల అధ్యక్షులు, నాయకులు ఆయనకు విష్ చేశారు. రాజకీయాల్లో అనేక దూషణలు, దాడులు ఎదురైనా వాటిని తట్టుకొని ఆయన నిలబడ్డారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యాంగం పట్ల రాహుల్ గాంధీ ధృఢమైన అంకితభావాన్ని, అణగారిన వర్గాల పట్ల ఆయనకున్న ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ సభ్యులందరూ భారీ వేడుకలకు దూరంగా ఉండాలనీ, బదులుగా దాతృత్వం, ఇతరులకు సహాయం చేయటంపై దృష్టి పెట్టాలని కోరారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె స్టాలిన్ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఆయనను 'ప్రియమైన సోదరుడు' అని పిలుస్తూ, దేశ ప్రజల పట్ల ఆయన అంకితభావాన్ని కొనియాడారు. యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ కూడా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వాయనాడ్‌కు రాహుల్ గాంధీ రాజీనామా

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానానికి అధికారికంగా రాజీనామా చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగనున్నారు. ఈ విషయాన్ని లోక్‌సభ స్పీకర్ కార్యాలయానికి అధికారంగా తెలియచేశారు. కాగా, వాయనాడ్ ఎంపీ స్థానం నుంచి రాహుల్ సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ పోటీ చేసిన వాయనాడ్, రాయ్‌బరేలీ రెండు స్థానాల నుంచి మెజారిటీతో గెలిచారు. కానీ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రెండింటిలో ఏదో ఒక స్థానాన్ని మాత్రం రాహుల్ వదులుకోవాలి. దీంతో రాహుల్ రాయ్‌బరేలీ ఎంపీగానే కొనసాగుతారనీ, వాయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ బరిలోకి దిగుతారని కాంగ్రెస్ పేర్కొన్నది.

కువైట్ వెళ్లేందుకు కేరళ మంత్రికి అనుమతి నిరాకరణ

సమాఖ్య స్ఫూర్తికే విరుద్ధం !

- మోడీకి కేరళ ముఖ్యమంత్రి విజయన్ లేఖ



తిరువనంతపురం : మంగాఫిల్ అగ్ని ప్రమాదం నేపథ్యంలో కువైట్ వెళ్లేందుకు ఆరోగ్యమంత్రి వీణా జార్జికి రాజకీయ అనుమతి నిరాకరించిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానికి లేఖ రాశారు. జూన్12న కువైట్‌లోని మంగాఫ్‌లో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారిలో సగం మంది కేరళీయులేనని, అందుకే రాష్ట్ర ఆరోగ్యమంత్రి వీణాజార్జినికి అక్కడికి పంపాలని కేరళ మంత్రివర్గం నిర్ణయించిందని ముఖ్యమంత్రి ఆ లేఖలో గుర్తు చేశారు. అక్కడికి వెళ్లిన కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి, ఇతర అధికారులు, భారత రాయబార కార్యాలయానికి సంబంధించిన క్యాకలాపాలను సమన్వయం చేయడానికి కేరళ ఆరోగ్యమంత్రి అక్కడ ఉంటే ఎంతగానో ఉపయోగపడేవారన్నారు. బాధితుల కుటుంబ సభ్యులకు మనో స్థైర్యాన్ని ఇచ్చేందుకు ఇది ఎంతగానో తోడ్పడేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధ్యతలు నిర్వర్తించడానికి మంత్రిని కువైట్ వెళ్లకుండా అడ్డుకోవడం అత్యంత శోచనీయమని అన్నారు. 2023 ఫిబ్రవరి28 నాటి కేబినెట్ సెక్రటేరియట్ ఆఫీస్ మెమోరాండం ప్రకారం రాజకీయ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నా అడ్డుకోవడం, ,కేరళ మంత్రివర్గ నిర్ణాయాన్ని సైతం కేంద్రం బేఖాతరు చేయడం సమాఖ్య స్ఫూర్తిని మంటగలిపేదిగా ఉందన్నారు. విపత్తులు సమయంలో బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యంగా కృషి చేయాలి. ఇలాంటి సందర్భంలో రాజకీయ అనుమతి ఇవ్వడానికి ఎలాంటి రాజకీయ, రాజకీయేతర అడ్డంకులు ఉండరాదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సహకార సమాఖ్య వ్యవస్థకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర గౌరవం, విశ్వాసం అవసరమని ఆయన ఆ లేఖలో తెలిపారు. ఇటువంటి సందర్భాల్లో రాష్ట్రాల విజ్ఞప్తిపై విదేశాంగ మంత్రిత్వ శాఖ బాధ్యతాయుతంగా స్పందించేలా చూడాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు. ఈ నెల 15న విజయన్ రాసిన లేఖ 19న బహిరంగ పరిచారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి అభ్యర్థనలు వచ్చినప్పుడు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిగా విదేశాంగ శాఖకు సూచించాలని కోరారు. కువైట్ అగ్ని ప్రమాదంలో 49మంది మరణించారు. వీరిలో 23మంది కేరళీయులే వున్నారు.

కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలు

- పేలవమైన పనితీరు కనబర్చిన తెలంగాణతోపాటు 8 రాష్ట్రాలకు కమిటీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పేలవమైన పనితీరు కనబర్చిన రాష్ట్రాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి పెట్టింది. జరిగిన తప్పిదాలను అంచనా వేసేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పార్టీ పేలవమైన పనితీరును అంచనా వేయడానికి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నిజనిర్ధారణ కమిటీలను ఏర్పాటుచేశారు. తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఢిల్లీ, కర్ణాటక, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లకు నిజ నిర్ధారణ కమిటీలు వేశారు. ఈ మేరకు బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో తెలంగాణకు సంబంధించి నిజనిర్ధారణ కమిటీలో పార్టీ సీనియర్ నేతలు పిజె కురియన్, రఖీబుల్ హుస్సేన్, పర్గత్ సింగ్‌లకు బాధ్యతలు అప్పగించారు. మధ్యప్రదేశ్‌కు పృథ్వీరాజ్ చవాన్, సప్తగిరి ఉల్కా, జిగ్నేష్ మేవానీ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు వీరప్ప మొయిలీ, హరీష్ చౌదరి, ఒడిశాకు అజయ్ మాకెన్, తారిక్ అన్వర్‌లకు బాధ్యతలు ఇచ్చారు. ఇక ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు కలిపి పిఎల్ పునియా, రజనీ పాటిల్‌కు చోటు కల్పించారు. కర్ణాటక కమిటీకి మధుసూదన్ మిస్త్రీ, గౌరవ్ గొగోయ్, హిబీ ఈడెన్‌లను సభ్యులుగా నియమించారు.

అందుకే నిజనిర్ధారణ కమిటీ

దక్షిణాదిలో తెలంగాణ నుంచి 10-12 ఎంపి స్థానాలు గెలుస్తామని భావించింది. ఎనిమిది స్థానాల్లో గెలిచి, బిజెపితో సమానంగా నిలిచింది. దీంతో తెలంగాణ రాష్ట్రాన్ని సైతం అధిష్టానం పూర్ ఫార్ఫార్మెన్స్ స్టేట్ కేటగిరిలో చేర్చి నిజనిర్ధారణ కమిటీ వేసినట్లు ఎఐసిసి వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌కు మధ్యప్రదేశ్, ఢిల్లీలో ఒక్క సీటు కూడా రాలేదు. చత్తీస్‌గఢ్‌లోనూ ఆశించిన ఫలితాలను రాబట్టుకోలేకపోయింది. అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఆశించిన స్థానాలు రాకపోయినా... గట్టి పోటీని ఇచ్చింది. ఉత్తరాఖండ్‌పై కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్నా ఎక్కువ సీట్లు గెలవడంలో పార్టీ విఫలమైంది.

మా వాటా నీళ్లివ్వకుంటే 21 నుంచి నిరవధిక దీక్ష

- ప్రధాని మోడీకి ఢిల్లీ మంత్రి అతిషి లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న నీటి సంక్షోభాన్ని తక్షణం పరిష్కరించకుంటే ఈ నెల 21 నుంచి నిరవధిక దీక్షకు దిగుతానని ఢిల్లీ రాష్ట్ర మంత్రి అతిషి హెచ్చరించారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. ఢిల్లీ ప్రజానీకం ఎదుర్కొంటున్న నీటి కొరత, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటి పరిష్కారానికి తక్షణమే ప్రధాని జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అతిషి తెలిపారు. 'ఈ రోజు ప్రధాన మంత్రికి లేఖ రాశాను. ఢిల్లీలోని 28 లక్షల మంది ప్రజానీకానికి నీళ్ల రావడం లేదనే విషయాన్ని విన్నవించాను. సాధ్యమైనంత త్వరగా ప్రజలకు నీరు అందేలా సాయం చేయాలని కోరాను. 21 నాటికల్లా ఢిల్లీ ప్రజలకు దక్కాల్సిన నీటి వాటా రాకుంటే సత్యాగ్రహానికి దిగడం మినహా నాకు మరో మార్గం లేదు' అని అతిషి తెలిపారు. జలాలకు సంబంధించిన సింహ భాగం వాటాను హర్యానా విడుదల చేయకపోవడంతో ఢిల్లీ నీటి సంక్షోభంలో పడిందన్నారు. మంగళవారం నాడు 613 ఎంజిడిలకు గానూ 513 ఎంజిడిల జలాలను మాత్రమే హర్యానా విడుదల చేసిందని, ఒక్క ఎంజిడి జలం 28,500 మందికి వెళ్తుందని, ఆ ప్రకారం 28 లక్షల మందికి నీరు అందడం లేదని ఆమె వివరించారు. ఢిల్లీ ప్రజలు తీవ్రమైన ఎండలతోపాటు నీటి కొరతను ఎదుర్కొంటున్నారని వాపోయారు. హర్యానా ప్రభుత్వానికి కూడా సమస్య పరిష్కారం కోసం చాలా లేఖలు రాసినట్టు తెలిపారు.

ఆప్ సర్కారుపై బిజెపి ఎదురుదాడి

ఢిల్లీలో నీటి సంక్షోభానికి ఆప్ ప్రభుత్వమే కారణమంటూ బిజెపి, కాంగ్రెస్ రాష్ట్ర విభాగాలు బుధవారం ఇందిరా క్యాంప్ ఏరియాలో నిరసనలు చేపట్టాయి. హర్యానా ప్రభుత్వం పూర్తి నీటి వాటాను యమునా నదిలోకి వదిలిందని, అయితే జలాలు ఢిల్లీలోకి అడుగుపెట్టగానే ఆప్ మద్దతుతో ట్యాంకర్ మాఫియా ఆ నీళ్ల దొంగిలిస్తోందని ఢిల్లీ బిజెపి అధ్యక్షులు వీరేంద్ర సచ్‌దేవ్, ఎంపి బన్సూరి స్వరాజ్ ఆరోపించారు.

గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను

యథాస్థానంలో ఉంచండి

- లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్లకు ఖర్గే లేఖ



న్యూఢిల్లీ : పార్లమెంట్ ప్రాంగణం నుంచి తొలగించిన మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్, ఇతర నాయకుల విగ్రహాలను తిరిగి యథాస్థానంలో ఉంచాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌లకు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే బుధవారం వేర్వేరుగా లేఖలు రాసారు. ప్రముఖ జాతీయ నాయకుల విగ్రహాలను ఎలాంటి సంప్రదింపులు లేకుండా మోడీ ప్రభుత్వం 'నిరంకుశం'గా ఒక మూలకు నెట్టివేసిందని లేఖలో ఖర్గే విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య ప్రాథమిక స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని అన్నారు. 'ఎలాంటి సంప్రదింపులు లేకుండానే ఈ విగ్రహాలను యథేచ్ఛగా తొలగించడం మన ప్రజాస్వామ్య ప్రాథమిక స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని నేను కచ్చితంగా చెబుతున్నాను. ఇప్పటి వరకూ మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేద్కర్, ఇతర జాతీయ నాయకుల విగ్రహాలు ప్రాధాన్యత కలిగిన స్థానాల్లో ఉన్నాయని ఎలాంటి ఆలోచన, పరిశీలన లేకుండానే చెప్పవచ్చు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ వ్యాప్తంగా ఉంచిన ప్రతి విగ్రహం, దానిని ఉంచిన స్థానం అపారమైన విలువ, ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి' అని స్పీకర్‌కు, చైర్మన్‌కు పంపిన లేఖల్లో ఖర్గే పేర్కొన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో జాతీయ నాయకులు, ఎంపీల చిత్రపటాలు, విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఒక ప్రత్యేక కమిటీ ఉన్న విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన ఖర్గే ఈ లేఖలో గుర్తు చేశారు. అయితే ఈ కమిటీని 2019 నుంచి ఏర్పాటు చేయలేదని ఖర్గే విమర్శించారు.

'సంబంధిత భాగస్వాములతో సరైన చర్చలు, సంప్రదింపులు లేకుండా తీసుకున్న ఇలాంటి నిర్ణయాలు మన పార్లమెంట్ నియమాలు, సంప్రదాయాలకు విరుద్ధం. అందువలన మన దేశ ఐక్యత, సమగ్రతకు విశేషంగా కృషి చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ అంబేద్కర్, ఇతర జాతీయ నాయకుల విగ్రహాలను గౌరవంతో, అభిమానంతో వాటివాటి యథాస్థానంలో మళ్లీ ఉంచాలని నేను డిమాండ్ చేస్తున్నాను' అని లేఖలో తెలిపారు. ఈ విగ్రహాల తొలగింపును కాంగ్రెస్ తీవ్రంగా విమర్శిస్తుందని చెప్పారు. ఈ నెల ప్రారంభంలో గాంధీ, అంబేద్కర్, ఛత్రపతి శివాజీ, బిర్సా ముండా, మహారాణా ప్రతాప్ వంటి ప్రముఖల విగ్రహాలను పార్లమెంట్ హౌస్ ప్రాంగణం నుంచి మోడీ ప్రభుత్వం తొలగించింది. దీనికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

తమిళనాడులో కల్తీ సారా తాగి తొమ్మిది మృతి

- 40మందికిపైగా అస్వస్థత
- సిబిసిఐడి దర్యాప్తునకు రాష్ట్రప్రభుత్వ ఆదేశాలు
- కలెక్టర్ బదిలీ, ఎస్‌పి సస్పెన్షన్



కల్లాకురిచి : తమిళనాడులోని కల్లాకురిచిలో కల్తీ సారా తాగి ఒక మహిళతో సహా తొమ్మిది మంది మరణించారు. మరో 40మంది అస్వస్థతతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఏడుగురు పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో వైద్య సాయం తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన రిపోర్ట్‌లు వచ్చిన తర్వాతనే మరణాలకు కారణం తెలుస్తుందని చెప్పారు. కల్లాకురిచి టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కరుణాపురంలో ఈ మరణాలు సంభవించాయి. మృతుల్లో చాలామంది రోజువారీ కూలీలే. కరుణాపురంలో ఒక వ్యాపారి నుండి వీరు కల్తీ సారా కొని తాగినట్లు భావిస్తున్నారు. మంగళవారం వారు తాగారు. ఆ తర్వాత కాసేపటికే వారికి ఊపిరాడకపోవడం, కళ్లు మసకబారడం, తల తిరగడం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయి. వీరిలో ముగ్గురు బుధవారం తెల్లవారు జామున ఇంటి వద్దనే మరణించగా, మరో ముగ్గురు కల్లాకురిచి ప్రభుత్వ ఆస్పత్రిలో చనిపోయారు. రోగులందరి బ్లడ్ నమూనాలను తీసుకుని ఫోరెన్సిక్ లేబరేటరీకి పంపించారు. మరో 40మందికి డాక్టర్ల బృందం చికిత్సనందిస్తోంది. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే వుంది. మరణాల నేపథ్యంలో బుధవారం ప్రభుత్వం ఈ ఘటనపై సిబిసిఐడి దర్యాప్తునకు ఆదేశించింది. జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేసింది. ఎస్‌పిని సస్పెండ్ చేసింది.

జగన్ టీమ్ జిఎడికి అటాచ్

(మొదటి పేజీ తరువాయి)

సరైన సమయం ఇవ్వకుండా చేశారనే విమర్శలు ఆయనపై ఉన్నాయి. అదే సమయంలో గత టిడిపి ప్రభుత్వంలో సమర్థవంతంగా వ్యవహరించిన అధికారులకు మరలా ప్రాధాన్యత కలిగిన పోస్టింగులు ఇచ్చారు. 2019 వరకూ పోలవరం ప్రాజెక్టు పనుల్లో చురుకుగా వ్యవహరించిన కాటంనేని భాస్కర్‌ను తీసుకొచ్చి కీలకమైన సిఆర్‌డిఏ కమిషనర్‌గా నియమించారు. గతంలో సిఎంకు సెక్రటరీగా వ్యవహరించిన పి.ఎస్.ప్రద్యుమ్నను మరలా సిఎం కార్యదర్శిగా నియమించారు.

ఐఎఎస్‌ల బదిలీలు ఇలా....

అధికారి పేరు	ప్రస్తుతం	బదిలీ
వై.శ్రీలక్ష్మి,	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్	సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు
రజత్‌భార్గవ,	ప్రత్యేక ప్రధాన కార్యదర్శిఎక్సైజ్ టూరిజం	సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు
జి.సాయిప్రసాదు,	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసిఏల్‌ఏ	జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
శశిభూషణ్‌కుమార్	ముఖ్య కార్యదర్శి ప్రిన్సిపల్ సెక్రటరీ జలవనరులశాఖ	పంచాయతీరాజ్‌శాఖ, ముఖ్య కార్యదర్శి
బుడితి రాజశేఖర్	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వెయిటింగ్	వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
అనిల్‌కుమార్ సింఘాల్	ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగవర్నర్ కార్యాలయం	పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
గోపాలకృష్ణ ద్వివేది	ప్రత్యేక ప్రధాన కార్యదర్శివ్యవసాయశాఖ	కార్మిక, ఫ్యాక్టరీస్, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
ప్రవీణ్ ప్రకాష్	ముఖ్య కార్యదర్శి స్కూల్ ఎడ్యుకేషన్	జిఏడిలో రిపోర్టు
సిద్ధార్థ జైన్	కమిషనర్ సర్వే సెటిల్‌మెంట్	పౌరసరఫరాలశాఖ కమిషనర్
సౌరభ్‌గౌర్	కమిషనర్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్	ఉన్నతవిద్యాశాఖ, స్కిల్స్ ముఖ్య కార్యదర్శి
కోన శశిధర్	కార్యదర్శి ఐటిఇ అండ్‌సి	పాఠశాల విద్యాశాఖ, ఆర్‌టిజిఎస్ కార్యదర్శి
ఎ.బాబు	కార్యదర్శి సహకార, మార్కెటింగ్	వ్యవసాయ సహకారశాఖ కార్యదర్శి
భాస్కర్ కాటంనేని	కమిషనర్‌స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	సిఆర్‌డిఏ, కమిషనర్
పి.ఎస్.ప్రద్యుమ్న	కార్యదర్శి రహదారులు, భవనాలశాఖ	ముఖ్యమంత్రి కార్యదర్శి
ఎం.జానకి	కమిషనర్ వెయిటింగ్	ఆర్థికశాఖ కార్యదర్శి
ఎం.ఎం.నాయక్	కమిషనర్ హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్	పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్
ప్రవీణ్‌కుమార్	కలెక్టర్ తిరుపతి	గనులశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (యువరాజు బదిలీ)
డి.మురళీధర్‌రెడ్డి	సెర్ప్ సిఇఓ	జిఏడిలో రిపోర్టు
వాడరేవు వినయ్‌చంద్	వెయిటింగ్	కార్యదర్శి ఆర్థికశాఖ

రష్యా, ఉ. కొరియా మధ్య

వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం

- ఇరు దేశాల అధినేతలు సంతకం



సియోల్ : అమెరికాకు వ్యతిరేకంగా తన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునే హక్కు ఉత్తర కొరియాకు ఉందని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ చెప్పారు. విదేశీ దాడులను, దురాక్రమణను తిప్పికొట్టడంలో రష్యా, ఉత్తర కొరియా పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై పుతిన్, కిమ్‌జోంగ్ ఉన్ బుధవారం సంతకాలు చేశారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత ఇరు దేశాల మధ్య బలమైన బంధంగా ఈ ఒప్పందాన్ని పరిగణిస్తున్నారు. తమ సంబంధాల్లో ఇదొక మైలురాయిగా ఇరువురు నేతలు భావిస్తున్నారు. భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంస్కృతిక, మానవతా సంబంధాలకు సంబంధించిన అంశాలన్నీ ఈ ఒప్పందం పరిధిలోకి వస్తాయి. 24 సంవత్సరాల తరువాత మొదటిసారిగా పుతిన్ ఉత్తర కొరియాలో పర్యటించిన నేపథ్యంలో ఈ ఒప్పందం వెలువడింది. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి పూర్తిగా మద్దతునిస్తామని కిమ్ ప్రకటించారు. ఇది చాలా బలమైన ఒప్పందంగా ఆయన వ్యాఖ్యానించారు. సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఈ ఒప్పందం వుందని పుతిన్ వ్యాఖ్యానించారు.

చాద్ ఆయుధాగారంలో పేలుళ్లు : 9 మంది మృతి

ఎన్‌జమెనా : చాద్ రాజధాని ఎన్‌జమెనాలోని సైనిక ఆయుధాగారంలో జరిగిన వరుస పేలుళ్లలో తొమ్మిది మంది చనిపోయారు. మరో 40మందికి పైగా గాయపడ్డారని అధికారులు బుధవారం తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పేలుళ్ల శబ్దాలతో నిద్రలో వున్న ప్రజలు ఉలిక్కి పడ్డారని, ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారని ప్రభుత్వ ప్రతినిధి అబ్దర్‌మన్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు. పేలుళ్లతో రాత్రిపూట ఆకాశమంతా పట్టపగల్లా మారిందని, దట్టమైన పొగ కమ్ముకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పేలుళ్ళకు కారణమేంటో తక్షణమే తెలియరాలేదు. దర్యాప్తు జరపాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు అధ్యక్షుడు మహమత్ దేబె తెలిపారు.

14 పంటలకు కనీస మద్దతు ధర పెంపు

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఖరీఫ్ సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. వరికి క్వింటాకు రూ.117 ఎంఎస్‌పి పెంచారు. 2023-24లో వరి (కామన్) ధరను రూ.2,183 నుంచి 2024-25లో రూ.2,300కి పెంచారు. 2023-24లో వరి గ్రేడ్ ఏ ధరను రూ. 2,203 నుంచి 2024-25లో రూ.2,320కి పెంచారు. జొన్నకు క్వింటాకు రూ.191 పెంచారు. 2023-24లో జొన్న (హైబ్రిడ్) ధరను రూ. 3,180 నుంచి 2024-25లో రూ. 3,371కి పెంచారు. జొన్న (మల్దండి) ధర రూ.196 పెంచారు. 2023-24లో రూ.3,225 నుంచి 2024-25లో రూ.3,421కి పెంచారు. బజ్రాకు రూ.125 పెంచారు. 2023-24లో బజ్రా ధరను రూ. 2,500 నుంచి 2024-25లో రూ. 2,625కి పెంచారు. రాగులుకు రూ. 444 పెంచారు. 2023-24లో రాగులు ధరను రూ.3,846 నుంచి 2024-25లో రూ. 4,290కి పెంచారు. మొక్కజొన్నకు రూ.135 పెంచారు. 2023-24లో మొక్కజొన్న ధరను రూ. 2,090 నుంచి 2024-25లో రూ. 2,225కి పెంచారు. కందులుకు రూ. 550 పెంచారు. 2023-24లో కందులు ధరను రూ. 7,000 నుంచి 2024-25లో రూ. 7,550కి పెంచారు. పెసలకు రూ. 124 పెంచారు. 2023-24లో కందులు ధరను రూ. 8,558 నుంచి 2024-25లో రూ. 8,682కి పెంచారు. మినుములకు రూ. 450 పెంచారు. 2023-24లో మినుముల ధరను రూ. 6,950 నుంచి 2024-25లో రూ. 7,400కి పెంచారు. వేరుశనగకు రూ.406 పెంచారు. 2023-24లో వేరుశనగ ధరను రూ. 6,377 నుంచి 2024-25లో రూ. 6,783కి పెంచారు. సన్ ఫ్లవర్ కు రూ.520కి పెంచారు. 2023-24లో సన్ ఫ్లవర్ ధరను రూ. 6,760 నుంచి 2024-25లో రూ. 7,280కి పెంచారు. సోయాబీన్ (ఎల్లో)కు రూ.292కి పెంచారు. 2023-24లో సోయాబీన్ (ఎల్లో) ధరను రూ. 4,600 నుంచి 2024-25లో రూ. 4,892కి పెంచారు. నువ్వులుకు రూ.632కి పెంచారు. 2023-24లో నువ్వులు ధరను రూ. 8,635 నుంచి 2024-25లో రూ. 9,267కి పెంచారు. నైజర్ సీడ్ కు రూ.983కి పెంచారు. 2023-24లో నైజర్ సీడ్ ధరను రూ. 7,734 నుంచి 2024-25లో రూ. 8,717కి పెంచారు. పత్తికి రూ.501 ఎంఎస్పి పెంచారు. 2023-24లో పత్తి (మీడియం) ధరను రూ. 6,620 నుంచి 2024-25లో రూ. 7,121కి పెంచారు. 2023-24లో పత్తి (మంచి క్వాలిటీ) ధరను రూ. 7,020 నుంచి 2024-25లో రూ.7,521కి పెంచారు.

విజిఎఫ్ స్కీమ్‌కు ఆమోదం

ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ల అమలు కోసం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) స్కీమ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. దేశంలో మొట్టమొదటి ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ఈ పథకం లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. సెంట్రల్ సెక్టార్ స్కీమ్ "నేషనల్ ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీమ్ (ఎన్‌ఎఫ్ఐఇఎస్)కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్యాంపస్‌లు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాల పెంపుదల కోసం రూ.2254.43 కోట్ల వ్యయం చేయనున్నారు.

వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.2869.65 కోట్లు అంచనా వ్యయంతో ప్రస్తుతం ఉన్న 3.9 మిలియన్ల ప్రయాణికులకు (ఎంపిపిఎ) నుండి 9.9 ఎంపిపిఎకి విమానాశ్రయం ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించనున్నట్లు తెలిపారు. 'మహారాష్ట్రలోని వధావన్‌లో ఆల్-వెదర్ గ్రీన్‌ఫీల్డ్ డీప్‌డ్రాఫ్ట్ మేజర్ పోర్ట్ అభివృద్ధి'కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.76,200 కోట్ల విలువైన ఈ ఓడరేవు పూర్తయితే ప్రపంచంలోని టాప్ 10 పోర్టులలో ఒకటిగా ఉంటుందని మంత్రి చెప్పారు.



లక్నోలో భారీగా కూల్చివేతలు

- అక్బర్ నగర్‌లోనే 1,200కు పైగా నిర్మాణాలు ధ్వంసం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని నగరం లక్నోలో బుధవారం భారీ ఎత్తున కూల్చివేతల కార్యక్రమం నిర్వహించింది. కేవలం అక్బర్‌నగర్‌లోనే 1200కు పైగా నిర్మాణాలను ధ్వంసం చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతల పేరుతో లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ (ఎల్‌డిఎ) ఈ కార్యక్రమం నిర్వహించింది. బుల్డోజర్లు, ఎక్స్‌కవేటర్లు వంటి భారీ యంత్రాలను ఉపయోగించి ఈ కూల్చివేతలు నిర్వహించారు. అక్బర్ నగర్‌లో కుక్రైల్ నది ఒడ్డున దాదాపు 1,169 అక్రమ నివాసాలను, 100కు పైగా వాణిజ్య అక్రమ భవనాలను కూల్చివేసినట్లు ఎల్‌డిఎ అధికారులు తెలిపారు. సోమవారం కూడా 100కు పైగా భవనాలను కూల్చివేసినట్లు చెప్పారు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్నాయని చెప్పారు. అక్బర్ నగర్‌లో ఎకో టూరిజం హబ్‌ను అభివృద్ధి చేయాలని యోగి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసమే ఈ కూల్చివేతల కార్యక్రమం చేపట్టింది.

నలంద యూనివర్సిటీ నూతన క్యాంపస్‌ను ప్రారంభించిన మోడీ

పాట్నా : నలంద యూనివర్సిటీ నూతన క్యాంపస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం ప్రారంభించారు. బీహార్‌లోని రాజ్‌గిరి ప్రాంతంలో ఉన్న పురాతన నలంద యూనివర్సిటీకి సమీపంలోనే ఈ కొత్త క్యాంపస్ కూడా ఉంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా మోడీ మాట్లాడుతూ భారతదేశం విద్యా వారసత్వానికి, చైతన్యవంతమైన సాంస్కృతిక మార్పిడికి నలంద విశ్వవిద్యాలయం ప్రతీక అని అన్నారు. నలంద అంటే ఇక గుర్తింపు, గౌరవం, గర్వం అని తెలిపారు. 'అగ్ని జ్వాలల్లో పుస్తకాలు కాలిపోవచ్చు. కానీ అగ్ని జ్వాలలు జ్ఞానాన్ని నాశనం చేయలేవు. ఈ సత్యాన్ని నలంద ప్రపంచానికి చాటింది' అని మోడీ చెప్పారు. ప్రారంభోత్సవ వేడుకకు వివిధ దేశాల ప్రతినిధులు హాజరుకావడంపై మోడీ హర్షం వ్యక్తం చేశారు. నలంద విశ్వవిద్యాలయ చట్టం 2010 ద్వారా నలంద విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. 14 మంది విద్యార్థులతో తాత్కాలిక ప్రదేశం నుంచి 2014లో విద్యా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కొత్త క్యాంపస్ నిర్మాణ పనులు 2017లో ప్రారంభమయ్యాయి. బుధవారం ప్రారంభోత్స కార్యక్రమానికి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, బీహార్ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు పురాతన నలంద విశ్వవిద్యాలయ శిథిలాలను మోడీ సందర్శించారు. బోధ్ గయ నుండి తీసుకువచ్చిన బోధి మొక్కను క్యాంపస్‌లో నాటారు.

ఫాసిజాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఫ్రాన్స్‌లో కొత్త పాపులర్ ఫ్రంట్

పారిస్ : ఫాసిజాన్ని అడ్డుకోవడమే తమ లక్ష్యమని వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులతో కూడిన పాపులర్ ఫ్రంట్ తెలిపింది. ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన మితవాద పార్టీలు, జాతీయ పార్లమెంటు ఎన్నికల్లోనూ రిపీట్ చేయాలని చూస్తున్నాయని, వారి ఆటలు సాగనివ్వమని చెప్పారు..గత వారం జరిగిన ఇయు పార్లమెంటరీ ఎన్నికల్లో అతిపెద్ద ఫ్రెంచ్ శక్తిగా రాస్సెంబ్లెమెంట్ నేషనల్ (నేషనల్ ర్యాలీ) పార్టీ అవతరించింది. అనేక నయా-ఫాసిస్ట్ పార్టీల మాదిరిగానే, నేషనల్ ర్యాలీ కూడా పెట్టుబడిదారీ పాలకవర్గప్రతినిధిగానే వ్యవహరిస్తోంది. నయా ఉదారవాద విధానాలను జోరుగా అమలు చేస్తోంది. 2022లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రెండవ స్థానంలో నిలిచిన లీ పెన్, ఈసారి పార్లమెంటరీ ఎన్నికలో విజయం సాధించవచ్చన్న ప్రచారం జరుగుతోంది. జాతీయ ర్యాలీ దూకుడుకు అడ్డుకట్ట వేయకపోతే దేశం ఫాసిస్టుల చేతుల్లోకి పోయే ప్రమాదముందని ఫ్రెంచ్‌కమ్యూనిస్ట్ పార్టీ పేర్కొంది. ఇది స్వల్పకాలిక ఎన్నికల పొత్తు కాదు, శాశ్వత కూటమిగా రూపొందుతుందని నాలుగు పార్టీల నాయకులు ఉద్ఘాటించారు. ట్రేడ్ యూనియన్‌లు, ప్రజా సంఘాలు, పర్యావరణ సంఘాలు , ఇతర పౌర సంఘాలు ఇప్పుడు న్యూ పాపులర్ ఫ్రంట్‌కి మద్దతుగా ర్యాలీల్లో పాల్గొంటున్నాయి...





మీకోసం
కాకరకాయలను ముక్కలుగా కట్‌చేసి ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే పండిపోకుండా ఉంటాయి.

జీవన సౌరభం
గమ్యం ఎంత ఎత్తులో ఉన్నా దాన్ని చేరుకునే మార్గం కిందనుంచే మొదలవుతుంది.

అమ్మకి ఇల్లు కట్టడం



ఆ రోజు ఆదివారం కావడంతో తల్లిని చూడ్డానికి స్వగ్రామం వెళ్ళాడు శంకరం. తల్లి క్షేమ సమాచారాలు తెలుసుకున్నాడు. 'నాయనా ఈ గదిలో బల్బు పనిచేయలేదు. లక్ష్మణరావుకి చూపించి బాగు చేయించు. పెరట్లో కిటికీ తలుపు ఊడిపోతోంది. అది కూడా బాగుచేయించు.' అంది ముసలి తల్లి.

'ఇప్పుడు సమయం లేదమ్మా! మళ్ళీ వారం తప్పకుండా చేయిస్తాను' అన్నాడు శంకరం. 'నువ్వు అమ్మకి ఇల్లు కడతావురా నాకు తెలుసు' అంది తల్లి.

'అమ్మా ఎందుకలా అన్నావో కాస్త చెప్పవా?' అని అడిగాడు శంకరం.

పూర్వం శివలింగపురంలో సత్తవ్వ ఒక పూరి గుడిసెలో నివసించేది. ఆమెకు చిన్నతనంలోనే రాజయ్యతో పెళ్ళయింది. కన్నవారి ఊరు అత్త వారి ఊరు అదే కావటంతో సత్తవ్వకి మరో ప్రపంచం తెలియకుండా పోయింది. ముగ్గురు పిల్లలు పుట్టాక భర్త కాలం చేశాడు. ఉన్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేస్తూ పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. హాస్టల్లో ఉంచి చదివించింది. పిల్లలు బాగా చదువుకుని ప్రయోజకులయ్యారు. పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. వాళ్లంతా పట్నాల్లో స్థిరపడ్డారు. అమ్మకి ఇల్లు కట్టాలి అనుకున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని అమ్మి కడతామన్నారు. వారసత్వంగా వచ్చిన భూమి అమ్మడానికి సత్తవ్వ ఒప్పుకోలేదు. ముగ్గురు కొడుకులు కలిసి ఇల్లు కట్టాలి అనుకున్నారు. మూడో వాడి భార్య 'రేపోమాపో మీ అమ్మ చచ్చిపోయేదే.. పల్లెటూళ్లో ఇల్లు ఎందుకు? పెట్టుబడి దండగ' అంది.

రెండో వాడి భార్య 'మీ అమ్మను తలొక మూడు నెలలు చూసుకుందాం. అప్పుడు ఇల్లు కట్టక్కర్లేదు' అంది. దాంతో ఆ ఆలోచన వాయిదా పడింది. ఇలా అనేక సార్లు అమ్మకి ఇల్లు కట్టాలి అనుకోవడం, అది కార్యరూపం దాల్చకపోవడం జరిగింది.


సత్తవ్వను కొడుకులు పట్నం తీసుకువెళ్దామని శతవిధాల ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆ ఊరిని, ఆ ఇంటిని వదిలి ఉండలేక ఎక్కడికీ వెళ్లేది కాదు. చివరకు ఆ ఇంట్లోనే ప్రాణాలొదిలింది. సత్తవ్వ ఊరు వదిలి వెళ్లలేదు, కొడుకులు ఇల్లు కట్టలేదు. బతికుండగా అమ్మకు ఇల్లు కట్టలేక పోయామని కొడుకులు ఎంతో బాధపడ్డారు. నాటినుంచి చేస్తామని చెప్పిన పని చెయ్యక పోయినా, వాయిదాలు వేసిన సందర్భంలో ఈ జాతీయాన్ని వాడుతున్నారు.

'నీ వరస కూడా అలాగే ఉంది' అని నిట్టూర్చింది తల్లి. తల్లి బాధను అర్థం చేసుకున్న శంకరం వెంటనే తల్లి చెప్పిన పనులు చేయించాడు.

కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అంకెలను వరుసగా కలిపితే అందమైన పక్షి బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.



నేను గీసిన బొమ్మ






యం.వర్షిణి,
6వ తరగతి,
అనంతసాగర్,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వైకల్యం సామర్థ్యానికి అడ్డు కాదు





కళ్ల ముందే నీటిలో పడి స్నేహితుడు కొట్టుకుపోయాడు. విగతజీవిగా మారిన అతన్ని, ఆ స్థితిలో చూసి తల్లడిల్లిపోయాడు రంజిత్ ప్యారా సాహెబ్ గోహెల్. ఆ సమయంలో ఏమీ చేయలేని అశక్తత అతనిది. పోలియోతో కాలు చచ్చుబడిపోయి, నడవడానికే సాధ్యం కాని తనకి ఆ సంఘటన చాలా రోజులు కళ్ల ముందు నుంచి తొలగిపోలేదు. తన తప్పు ఏమీ లేకపోయినా కుంగిపోయాడు. ఆ స్థితి నుంచి బయటపడాలని, తనకు సాధ్యం కాని ఈత నేర్చుకునేందుకు ఓ రోజు బయల్దేరాడు. అది మొదలు ఇప్పటి దాకా ఆ నడక ఆపలేదు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నాడు. తనలాంటి వారికి చేయూతగా నిలబడుతున్నాడు.

గుజరాత్, అహ్మదాబాద్‌కి చెందిన రంజిత్‌కి మూడేళ్లప్పుడే పోలియో సోకింది. కుడి కాలు పనిచేయడం మానేసింది. ఇంటి ఆర్థిక పరిస్థితులు బాగోలేక 9వ తరగతి నుంచే కుటుంబానికి సాయపడేందుకు సిద్ధమయ్యాడు. మూడు దశాబ్దాల క్రితం స్నేహితుణ్ణి కోల్పోయినప్పుడు తీసుకున్న నిర్ణయమే ఇప్పుడు అతనిని ప్రత్యేకంగా నిలబెట్టింది. అయితే ఇదేమీ అంత సులభంగా సాధించింది కాదు.

'చచ్చుబడిపోయిన కాలుతో నువ్వేలా ఈదుతావు' అంటూ ఈత నేర్పడానికి స్విమ్మింగ్ ఇనిస్టిట్యూట్ నిరాకరించింది. అయినా వెనుదిరగలేదు. ఎన్నో ప్రయత్నాలు చేసిన తరువాత ఒక్క కాలితో ఈదేందుకు అనుమతి తీసుకున్నాడు. వచ్చిన అవకాశాన్ని ఏమాత్రం జారవిడవకుండా ఎంతో పట్టుదలతో నేర్చుకున్నాడు. అసలు ఈత నేర్పడమే దండగ అనుకున్న వారితోనే శభాష్ అనిపించుకున్నాడు. ఈత పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్ పోటీల్లో పాల్గొని ఆ ఘనత సాధించిన ప్రపంచ ఐదవ క్రీడాకారుడిగా స్థానం సంపాదించాడు.

ఈత నేర్వడంతో రంజిత్ సాహస ప్రయాణం ముగియలేదు. ఈసారి పర్వతారోహణ చేయాలని సంకల్పించాడు. తన సామర్థ్యంతో పర్వతారోహకులకు లభించే చంద్రఖని పాస్, సర్ పాస్‌లను సాధించాడు. అడపాదడపా పర్వతారోహణ చేస్తున్నాడు. పర్వతాలు ఎక్కిన ఉత్సాహంతో ఈసారి తనకిష్టమైన క్రికెట్‌లో రాణించాలనుకున్నాడు. గుజరాత్ టీమ్‌లో కీలక ఆటగాడిగా తనదైన ముద్ర వేశాడు.

క్రీడల్లో రాణిస్తున్నప్పుడే రంజిత్‌కి 1989లో రైల్వే పోస్టల్ విభాగంలో ఉద్యోగం లభించింది. అప్పటి నుంచి ఆర్థికంగా స్థిరపడిన రంజిత్ ఈసారి తనలాంటి వారి గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు. అప్పటికే వివిధ పోటీల్లో 185 పతకాలు సాధించాడు. 85 బంగారు పతకాలు, 20 అంతర్జాతీయ పసిడి పతకాలు అతని సొంతమయ్యాయి. ఆ విజయాలతోనే వైకల్యబాధితులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు.

వైకల్య బాధితులకు అండగా నిలిచే స్వచ్ఛంద సంస్థల సాయంతో రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఈత, క్రికెట్, బాడ్మింటన్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వడం దినచర్యగా చేసుకున్నాడు. 'వైకల్య బాధితులకు ఉపాధి దొరకడం చాలా కష్టం. పైగా ప్రభుత్వ పథకాలు కూడా చాలా మందికి అందవు. దీంతో చాలామంది వైకల్య బాధితులు తీవ్ర నిరాశతో ఉంటారు. వారి న్యాయమైన హక్కులు వాళ్లకి తెలిసేలా చేయడం కూడా నా దినచర్యలో భాగం చేసుకున్నాను' అంటూ తన పనుల క్రమాన్ని రంజిత్ వివరిస్తారు.

'ప్రజలు నన్ను వైకల్య బాధితుడిగా, పేదవాడిగా చూడడం నాకిష్టం లేదు. వైకల్యం సామర్థ్యానికి అడ్డుగా నిలవకూడదనే నా సంకల్పం. అందుకే నాకు సాధ్యమైనంత వరకు నన్ను నేను నిరూపించుకున్నాను. ఆ సామర్థ్యాన్ని అందరికీ చేరువ చేయాలని ప్రయత్నిస్తున్నాను. ఇంతకు మించి నేను చేసిన గొప్ప పని ఏమీ లేదు' అని చెబుతున్న 57 ఏళ్ల రంజిత్ ఎంతోమందికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నాడు..

జుట్టు సమస్యలను దూరంచేసే సహజ ప్యాకులు

చాలామంది జుట్టు సంరక్షణ కోసం మార్కెట్లో దొరికే వివిధ రకాల ఉత్పత్తులను వాడుతుంటారు. వీటిలోని రసాయనాల వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇంట్లో సహజ సిద్ధమైన పదార్థాలతో వివిధ రకాల హెయిర్ ప్యాక్స్ తయారు చేసుకొని అందమైన, ఆరోగ్యమైన, జుట్టును ఎలా పొందవచ్చో చూద్దాం..

పెరుగు, ఉసిరి పొడి, మందార పొడి :
కొద్దిగా మందార పొడి, ఉసిరి పొడి, పెరుగు కలిపిన మిశ్రమాన్ని జుట్టుకు మర్దనా చేసి అరగంట తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. మందార పొడిలో సమృద్ధిగా ఉండే ఎమైనో యాసిడ్లు జుట్టు ఎదుగుదలకు తోడ్పడతాయి. ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ జుట్టు ఆరోగ్యానికి సహాయపడి, రాలడాన్ని తగ్గిస్తాయి. పెరుగులోని మంచి బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది.

మెంతులు, పెరుగు :
నాలుగు టేబుల్ స్పూన్ల మెంతులను ఐదు టేబుల్ స్పూన్ల పెరుగులో రాత్రిపూట నానబెట్టాలి. ఉదయం ఈ మిశ్రమాన్ని మెత్తగా మిక్సీ పట్టి, తలకు పట్టించాలి. ఒక గంట తర్వాత గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. మెంతుల్లో ప్రొటీన్, ఐరన్, ఫ్లేవనాయిడ్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు జుట్టును దఢంగా చేస్తాయి. పెరుగు జుట్టుని ప్రకాశవంతంగా, పట్టులా మారుస్తుంది.

కరివేపాకు, మందారం, కొబ్బరి నూనె :
ఒక పాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె, పది కరివేపాకులు వేసి మరిగించాలి. చల్లారాక ఈ నూనెతో మసాజ్ చేసుకోవాలి. 45 నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు, ప్రొటీన్లు, బీటా కెరోటిన్, ఐరన్ ఎక్కువగా ఉంటాయి. ఇది జుట్టు ఎదుగుదలకు తోడ్పడుతుంది. కొబ్బరి నూనెలోని విటమిన్లు జుట్టును బలంగా ఉంచుతాయి.

ఉసిరి పొడి, ఇండిగో :
రెండు టేబుల్ స్పూన్ల ఉసిరి పొడి, నాలుగు టేబుల్ స్పూన్ల ఇండిగో పొడి పేస్టులా కలిపి తలకు పట్టించి 20 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేస్తుండడం వల్ల జుట్టు నల్లబడుతుంది.

ఆముదం : కేశ సంరక్షణకు ఆముదం చాలా మంచిది. జుట్టుని ఒత్తుగా ఉంచుతుంది. ఆముదంలో ఫ్యాటీ యాసిడ్లు, ఇతర ప్రోటీన్లు జుట్టుని ప్రకాశవంతంగా మారుస్తాయి. చుండ్రు సమస్యను దూరం చేస్తాయి.

'కల్కి'తో శోభన రీ ఎంట్రీ



ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనె, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. కాగా ఈ సినిమా ట్రైలర్ నుంచి ప్రమోషన్ కార్యక్రమాలు వేగవంతమయ్యాయి. ఈ సినిమాలో మరియమ్ పాత్రలో సీనియర్ నటి, శోభన నటిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆమె విడుదల చేశారు. 2006లో వచ్చిన 'గేమ్' సినిమా తర్వాత శోభన తెలుగులో మరో సినిమా చేయలేదు. సుమారు 18 ఏళ్ల తర్వాత 'కల్కి' చిత్రం ద్వారా మళ్లీ వెండితెరపై శోభన కన్పించబోతున్నారు. మరో 8 రోజుల్లో మరియమ్‌ను కలుస్తారని వైజయంతి మూవీస్ వారు ఒక పోస్టను విడుదల చేశారు. ప్రస్తుతం ఇది సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ అవుతోంది. ఈ సినిమాలో నాని, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ అతిథి పాత్రల్లో నటించారని అంటున్నారు.



'శివం భజే' ఫస్ట్ కట్ వీడియో విడుదల

యువ హీరో అశ్విన్ బాబు నటిస్తున్న తాజా చిత్రం 'శివం భజే'. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ కట్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ అంశాలతో పాటు మైథలాజికల్ అంశాలు కూడా ఈ సినిమాలో ఉండబోతున్నట్లు ఈ ఫస్ట్ కట్ వీడియో చూస్తే అర్థమవుతోంది. దిగంగనా సూర్యవంశీ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాను అప్సర్ తెరకెక్కిస్తున్నారు. మహేశ్వర్ రెడ్డి మూలి ప్రొడ్యూస్ చేస్తున్న ఈ సినిమాకు వికాస్ బడిసా సంగీతం అందిస్తున్నారు.

'శ్రీమతి గారు' లిరికల్ సాంగ్ విడుదల

దర్శకుడు వెంకీ అట్లూరి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'శ్రీమతి గారు'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో బ్యాంక్ క్యాషియర్‌గా దుల్కర్ సల్మాన్ కనిపిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ విశేషంగా ఆకట్టుకుంటోంది.

మహేష్‌బాబు సహాయం



కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలు పంచాయతీ ప్రశాంత్‌నగర్‌కు చెందిన కాకర్లమూడి రాజేష్ మహేష్‌బాబుకు వీరాభిమాని. అతని భార్య సుజాత. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మొదట్లో కృష్ణకు వీరాభిమాని అయిన రాజేష్ ఆ తర్వాత మహేష్‌బాబును అభిమానిస్తున్నారు. అతడిపై ఇష్టంతో పిల్లలకు అర్జున్, అతిథి, ఆగడు పేర్లు పెట్టారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేష్‌కు కిడ్నీ పాడైపోయి మంచాన పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మహేష్‌బాబు తన బృందాన్ని పెదప్రోలుకు పంపించారు. అతిథి, ఆగడు పిల్లల్ని ప్రయివేటు స్కూలులో చేర్పించే ఏర్పాటు చేశారు. ఏటేటా వారి విద్యకయ్యే ఖర్చునంతా భరిస్తానని మహేష్‌బాబు చెప్పారని బృంద సభ్యులు తెలిపారు. రాజేష్ వైద్యానికి కూడా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

అందరికీ నచ్చే సినిమా 'నింద'



'మలయాళ సినిమాలు చూసి, మన దగ్గర (టాలీవుడ్) ఇలాంటి సినిమాలు ఎందుకు రావా అని అంతా అనుకుంటారు. ఇప్పుడిప్పుడే మన దగ్గర కూడా మంచి కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు వస్తున్నాయి. 'నింద' కూడా అలాంటి చిత్రమే. సినిమా చూశాక ప్రతి ప్రేక్షకుడు 'ఇదేదో బాగానే ఉందే.. బాగా తీశారు' అనే ఫీలింగ్ కలుగుతుంది. అందరికి నచ్చేలా ఈ చిత్రం ఉంటుంది' అని దర్శక, నిర్మాత రాజేష్ జగన్నాథం అన్నారు. వరుణ్ సందేష్ హీరోగా నటించిన 'నింద' చిత్రం ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా రాజేష్ మీడియాతో మాట్లాడారు. "ఫిల్మ్ మేకింగ్‌పై ఉన్న ఇంట్రెస్ట్‌తో యూఎస్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చాను. నింద కథ వరుణ్‌కు చెప్పడంతో నచ్చి..వెంటనే ఓకే చేశాడు. నిర్మాత కోసం ప్రయత్నించాం. కానీ దొరకలేదు. కథపై ఉన్న నమ్మకంతో చివరకు నేనే నిర్మించాను. టెక్నికల్‌గా సినిమా చాలా బాగుంటుంది. పిఎస్ వినోద్ వద్ద అసిస్టెంట్‌గా పని చేసిన రమిజ్ ఈ చిత్రానికి కెమెరామెన్‌గా పనిచేశారు. విశాల్ చంద్రశేఖర్ వద్ద పని చేసిన సాంతు ఓంకార్ మంచి ఆర్ఆర్, మ్యూజిక్‌ను ఇచ్చారు. సినిమాలోని ప్రతి ఒక్క కారెక్టర్ అందరికీ గుర్తుండిపోతుంది.' అని వివరించారు.

త్వరలో ఆస్ట్రేలియాకు రామ్‌చరణ్



హీరో రామ్ చరణ్- బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఆర్‌సి-16 సినిమా సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. అక్టోబర్‌లో ఈ సినిమా పట్టాలెక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ సినిమా ప్రకటన వచ్చి ఇప్పటికే చాలా రోజులైంది. పూజా కార్యక్రమాలతో ప్రారంభం జరిగినా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కాలేదు. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఆర్‌సి 16 ప్రాజెక్ట్ త్వరలోనే పట్టాలెక్కనున్నట్లుగా సమాచారం. ఈ చిత్రం షూటింగ్ కోసం రామ్‌చరణ్ ఆస్ట్రేలియాకు త్వరలో బయలుదేరి వెళ్లనున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగు ఈ సినిమాలో చాలా పవర్‌ఫుల్ పాత్రలో రామ్‌చరణ్ నటించనున్నారు. గేమ్ చేంజర్ చిత్రం పూర్తయిన తర్వాత అక్టోబర్‌లో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇదే. స్పోర్ట్స్ డ్రామాగా, గ్రామీణ నేపథ్యంలో కథ సాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఆర్‌సి16 పేరుతో ఉన్న ఈ ప్రాజెక్టుకు 'పెద్ది' అనే పేరును ఖరారు చేసినట్లుగా తెలిసింది.

మంధాన, కౌర్ సెంచరీలు

- దక్షిణాఫ్రికా మహిళలపై నాలుగు పరుగుల తేడాతో గెలుపు
- వన్డే సిరీస్ 2-0తో కైవసం



బెంగళూరు: భారత్, దక్షిణాఫ్రికా మహిళల మధ్య జరిగిన రెండో వన్డేలో టీమిండియా మహిళలు చివరి బంతికి గెలిచి ఊపిరి పీల్చుకున్నారు. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రత్ సేన నాలుగు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 325పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన(136), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(103నాటౌట్) సెంచరీలతో రాణించారు. అనంతరం దక్షిణాఫ్రికా మహిళలు నిర్ణీత 50 ఓవర్లు పూర్తయ్యే సరికి 6వికెట్లు కోల్పోయి 321పరుగులు మాత్రమే చేశారు. ఓపెనర్ వోల్వోడార్ట్(135నాటౌట్), కాప్(114) భారీ శతకాలతో రాణించారు. వీరిద్దరూ క్రీజ్‌లో ఉన్నంతసేపు దక్షిణాఫ్రికా జట్టు విజయం వైపు దూసుకెళ్లగా.. కాఫ్ ఔటవ్వడంతో జట్టు ఫలితంపై ప్రభావం చూపింది.

హర్మన్, మంధాన శతకాలు..

ఈ మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ మంధన మెరుపు శతకంతో విరుచుకుపడితే.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సుడిగాలి సెంచరీతో (103నాటౌట్; 88బంతుల్లో, 9ఫోర్లు, 3సిక్సర్లు) అలరించింది. 49వ ఓవర్ 2వ బంతి ఎదుర్కొనే సమయానికి 85 బంతుల్లో 88 పరుగులు చేసిన హర్మన్ ఆ తర్వాత మూడు బంతులను వరుసగా 4, 6, 4 బాది సెంచరీ పూర్తి చేసుకుంది. వన్డేల్లో హర్మన్‌కు ఇది 6వ సెంచరీ. టీమిండియా తరపున అత్యధిక వన్డే సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో హర్మన్ మూడో స్థానంలో నిలిచింది. ఇదే మ్యాచ్‌లో సెంచరీ చేసిన మంధన భారత్ తరపున అత్యధిక వన్డే సెంచరీలు చేసిన మిథాలీ రాజ్ రికార్డును(7) సమం చేసింది. కెప్టెన్, వైస్ కెప్టెన్లు ఇద్దరూ సెంచరీలతో కదం తొక్కడంతో భారత్ భారీ స్కోర్ చేసింది. షఫాలీ వర్మ (20), హేమలత (24), రిచా ఘోష్ (25 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లు మాబేకు రెండు వికెట్లు దక్కాయి.

భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు ఛేదనను ధాటిగానే ప్రారంభించింది. ఓపెనర్ బ్రిట్(5) నిరాశపరిచినా.. మరో ఓపెనర్ వోల్వోడార్ట్ (135నాటౌట్) చివరి బంతి వరకు క్రీజ్‌లో నిలిచి టీమిండియా బౌలర్లకు చెమటలు పట్టించింది. దక్షిణాఫ్రికా జట్టు ఓ దశలో 67పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో వోల్వోడార్ట్, కాప్(114) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ 4వ వికెట్‌కు ఏకంగా 184పరుగులు జతచేసి గెలుపు తీరాలకు చేర్చారు. చివరి ఓవర్లో 11 పరుగులు దక్షిణాఫ్రికా చేయాల్సి రాగా.. పూజ వస్త్రాకర్ వేసిన తొలి రెండు బంతులకు 5పరుగులు రాబట్టి 4 బంతుల్లో 6పరుగులకు సమీకరణలు మారాయి. ఆ దశలో పూజ వరుసగా 2 బంతుల్లో ఇద్దరు బ్యాటర్లు ఔట్‌చేసి విజయాన్ని భారత్‌వైపు తిప్పింది. చివరి బంతికి 5పరుగులు చేయాల్సి రాగా.. ఆ బంతిని పూజ డాట్‌బాల్‌గా వేయడంతో భారత్‌కు విజయం దక్కింది. ఈ గెలుపుతో భారత్ మూడు వన్డేల సిరీస్‌ను మరో వన్డే మిగిలి ఉండగానే 2-0తో చేజిక్కించుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

ఇండియా మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)తాంజ్మిన్ బ్రిట్స్ (బి)మాబే 136, షెఫాలీ వర్మ (సి)క్లాస్ (బి)మాబే 20, హేమలత (సి)బాట్చ్ (బి)క్లాస్ 24, హర్మన్‌ప్రీత్ కౌర్ (నాటౌట్) 103, రిచా ఘోష్ (నాటౌట్) 25, అదనం 17. (50 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 325పరుగులు. **వికెట్ల పతనం:** 1/28, 2/100, 3/271 **బౌలింగ్:** కాకా 10-2-51-0, క్లాస్ 10-0-67-1, క్లార్క్ 8-1-50-0, మాబే 10-0-51-2, షాంగాసే 6-0-57-0, బాట్చ్ 1-0-10-0, లూస్ 5-0-36-0

దక్షిణాఫ్రికా మహిళల ఇన్నింగ్స్: వోల్వోడార్ట్ (నాటౌట్) 135, బ్రిట్స్ (బి)అరుంధతి రెడ్డి 5, బాట్చ్ (సి)రోడ్రిగ్స్ (బి)దీప్తి 18, లూస్ (సి)రీచా (బి)మంధాన 12, కాప్ (సి)పూజ (బి)దీప్తి 114, క్లార్క్ (సి)అరుంధతి రెడ్డి (బి)పూజ 28, షాంగేస్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)పూజ 0, రిడైర్ (నాటౌట్) 0, అదనం 9. (50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 321పరుగులు. **వికెట్ల పతనం:** 1/14, 2/54, 3/67, 4/251, 5/320, 6/320 **బౌలింగ్:** పూజ వస్త్రాకర్ 7-0-54-2, అరుంధతి రెడ్డి 8-0-62-1, దీప్తి శర్మ 10-1-56-2, రాధా యాదవ్ 10-0-52-0, స్మృతి మంధాన 2-0-13-1, శోభన 9-0-53-0, షెఫాలీ వర్మ 4-0-26-0.

డికాక్ ధనా ధన్..

అమెరికాపై 18పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు



ఆంటిగ్వా: టి20 ప్రపంచకప్ సూపర్-8లో దక్షిణాఫ్రికా జట్టు బోణీకొట్టింది. అమెరికాతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 18పరుగుల తేడాతో గెలిచింది. తొలుత ఓపెనర్ డికాక్(74) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ మార్క్రమ్(46), క్లాసెన్(36నాటౌట్), స్టబ్స్(20నాటౌట్) రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు 4వికెట్ల నష్టానికి 194పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అమెరికా జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 6వికెట్లు కోల్పోయి 176పరుగులే చేసింది. తొలుత దక్షిణాఫ్రికాకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్, వికెట్ కీపర్ డికాక్(74) రాణించినా.. మరో బ్యాటర్ రోడ్రిగ్స్(11) నిరాశపరిచాడు. దీంతో సఫారీ జట్టు 16పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత మార్క్రమ్‌తో కలిసి డికాక్ 2వ వికెట్‌కు 110పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ ఔటయ్యాక దక్షిణాఫ్రికాను క్లాసెన్, స్టబ్ ఆదుకున్నారు. వీరిద్దరూ చివర్లో చెలరేగి ఆడడంతో ఆ జట్టు 194పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. అమెరికా బౌలర్లు నేత్రావాల్కర్, హర్మీత్ సింగ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో అమెరికా ఓపెనర్ టేలర్(24)కి తోడు గౌస్(80నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించాడు. చివర్లో హర్మీత్ సింగ్(38) బ్యాట్ ఝుళిపించినా.. చివరి రెండు ఓవర్లను దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టంగా వేయడంలో దక్షిణాఫ్రికాకు విజయం దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డికాక్‌కు లభించింది.

టీమిండియాకు తొలి పరీక్ష

నేడు ఆఫ్ఘనిస్తాన్‌తో ఢీ • రా.8.00గం॥లకు

బార్బొడాస్: టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సూపర్-8లో తొలి పరీక్షను ఎదుర్కోనుంది. గ్రూప్-ఎ వరుస విజయాలతో సూపర్-8కు చేరిన టీమిండియా ఇక సూపర్-8పై దృష్టి సారించింది. బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో రోహిత్ శర్మ సారథ్యంలోని భారతజట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది. విండీస్ గడ్డపై ఐదు రోజుల వ్యవధిలోనే భారత్ మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈనెల 20న అఫ్ఘాన్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, ఆ తర్వాత 22న బంగ్లా, 24న ఆసీసతో తలపడుతుంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు
ఇంగ్లండ్ × వెస్టిండీస్
వేదిక: సె.లూసియా; ఉ.6.00గం॥లకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68